## సిపిని కలసిన మండి బజార్ మర్చంట్




PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

## గ్రామపంచాయతీ సర్పంచుల శిక్షణ కార్యక్రమం




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 52 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 18 ఫిబ్రవరి 2026




## విశాఖకు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**అమరావతి ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖ పట్నానికి చేరుకున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆమె విశాఖ నేవల్ ఎయిర్ స్టేషన్ డేగాకు ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ , మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి స్వాగతం పలికారు.విశాఖపట్నంలో జరుగనున్న మిగతా2లో...

# కృత్రిమ మేధ కళ్లద్దాలు

## •ఏఐ అద్దాలతో దర్శనమిచ్చిన ప్రధాని మోడీ



**ముంబై,ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భారత్ ఆతిథ్యమిస్తున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో-2026, సమిట్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ సదస్సు జరుగుతోన్న వేళ మన స్టార్టప్ 'సర్వం ఏఐ' చేసిన ప్రకటన వార్తల్లో నిలిచింది. త్వరలో ఏఐ స్మార్ట్ గ్లాసెస్ తీసుకువస్తామని వెల్లడించింది. ఆ అద్దాలు ధరించిన ప్రధాని మోదీ ఫొటో ఇప్పుడు నెట్టింట్లో వైరల్‌గా మారింది. కాగా...కృత్రిమ మేధ రంగంపై విస్తృతంగా చర్చించేందుకు, అత్యాధునిక ఆవిష్కరణలపై అవగాహన కల్పించే లక్ష్యంతో భారత్‌లో ఏఐ సమిట్ జరుగుతోంది. ఏఐ ప్రయాణంలో భారత్ ముందు వరుసలో నిలిచిందని, దాని పురోగతి.. లక్ష్యం, బాధ్యతలను ప్రతిబింబిస్తుందని ఇప్పటికే మోదీ పేర్కొన్న సంగతి తెలిసిందే. బెంగళూరు కేంద్రంగా 2023లో వివేక్ రాఘవన్, ప్రత్యూష్ కుమార్ ఈ సర్వం ఏఐని మిగతా2లో...



## పెళ్లికి ముందే శారీరక సంబంధాలు సరికాదు

### వ్యక్తి గురించి తెలుసుకోకుండా మోసపోతే ఎలా

### కేసు విచారణ సందర్భంగా సుప్రీం హితోక్తులు

**న్యూఢిల్లీ, 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :**నేటి కాలంలో సోషల్ మీడియా, మ్యాట్రిమోనీ సైట్ల ద్వారా పరిచయాలు పెరిగి మోసపోతున్న ఘటనలు ఎక్కువవుతున్న మిగతా2లో...

## తెలంగాణ గ్రామీణ క్రీడా రంగానికి సాంకేతిక హంగులు

### మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేందుకు సీఎం కప్

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్,ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ గ్రామీణ క్రీడా రంగానికి ప్రోత్సాహం ఇచ్చే లక్ష్యంతో నిర్వహిస్తున్న రెండో విడత సీఎం కప్ 2025 -26 కు సాంకేతిక హంగులు సమకూర్చి క్రీడాకారులకు ఇష్టమైన సమాచార మిగతా2లో...

## గ్లోబల్ మ్యానుఫాక్చరింగ్ కేంద్రంగా

# హైదరాబాద్

- నాణ్యమైన విద్యాసంస్థలకు నెలవుగా నగరం
- జీవవిజ్ఞాన రంగంలో రూ.73,000 కోట్లకు పైగా పెట్టుబడులు
- రెండేళ్లుగా స్పష్టమైన విజన్‌తో ముందుకు వెళుతున్నాం
- బయో ఏషియా సదస్సు ప్రారంభంలో సీఎం రేవంత్






**హైదరాబాద్,ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హైదరాబాద్ అంటే చార్మినార్.. బిర్యానీ.. ఫార్మా.. సాఫ్ట్‌వేర్ అని గుర్తు.. కానీ ఇవాళ గ్లోబల్ మాన్యుఫాక్చర్‌కి కేంద్రంగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నాణ్యమైన విద్యాసంస్థలు.. ఇక్కడ ఉన్నాయి.. హైదరాబాద్ క్యాపబుల్ సెంటర్‌గా మారిందన్నారు.హైటెక్స్‌లో బయో ఏషియా 2026 సదస్సును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ముందస్తు విజన్, మిగతా2లో...

## లాటరీలో తొర్రూరును కొట్టేసిన కాంగ్రెస్

- 7 సీట్లు మాత్రమే గెలిచినా వరించిన విజయం
- చైర్మన్‌గా శ్రవణ్ కుమార్ ఎన్నిక
- తొర్రూరు చేజారడంతో ఎర్రబల్లి కన్నీరు



**మహబూబాబాద్,ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఉత్కంఠకు తెరదించుతూ తొర్రూరు మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మున్సిపల్ చైర్మన్ పదవి కోసం జరిగిన హోరాహోరీ పోరులో చివరకు అదృష్టం కాంగ్రెస్ అభ్యర్థిని వరించింది. చైర్మన్ ఎన్నిక ప్రక్రియలో ఇరు వర్గాల బలాబలాలు సమానంగా ఉండటంతో అధికారులు 'లక్కీ డ్రా' పద్ధతిని అనుసరించారు. ఈ డ్రాలో కాంగ్రెస్ అభ్యర్థి, రెండో వార్డు సభ్యుడు శ్రవణ్ కుమార్ విజేతగా నిలిచారు. దీంతో ఎన్నికల అధికారి ఆయన పేరును అధికారికంగా ప్రకటించి పత్రాన్ని అందజేశారు. మున్సిపాలిటీని దక్కించుకోవడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకుంటుండగా, బీఆర్ఎస్ క్యాంప్‌లో విషాదం నెలకొంది. తొర్రూర్‌లో మొత్తం 16 వార్డుల్లో బీఆర్ఎస్ 9, మిగతా2లో...



## జెఇఇ మెయిన్ పరీక్షలో మెరిసిన బీసీ విద్యార్థులు

- పరీక్షకు హాజరైన 318 మంది విద్యార్థులు
- 100పర్సెంటైల్ పైగా సాధించిన 5గురు విద్యార్థులు
- 80 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించిన 28మంది విద్యార్థులు
- అభినందించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** దేశవ్యాప్తంగా మొదటి విడతలో జరిగిన జెఈఈ మెయిన్ ప్రవేశ పరీక్షలో బీసీ గురుకుల ఇంటర్ విద్యార్థులు 318 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో ఐదుగురు విద్యార్థులు 90 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించారు. మిగతా2లో...

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు

- మార్చి చివరి నాటికి లబ్దిదారుల ఎంపిక
- అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం
- యుద్ధప్రాతిపదికన లబ్దిదారుల ఎంపిక
- ఆర్,ఆర్, ఆర్, ఓ ఆర్ ఆర్ మధ్య అఫర్డ్‌బుల్ హౌసింగ్ పాలసీ
- నెలాఖులోగా ఇండ్ల స్థలాలు కలిగిన 28వేల మందికి ఇందిరమ్మ ఇండ్లు
- హౌసింగ్ పాలసీపై అధికారులతో మంత్రుల సమీక్ష



**హైదరాబాద్,ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమి)పరిధి లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించి వచ్చే మార్చి చివరినాటికి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రకటించారు. మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థలాల సేకరణ, అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి, పూర్తయిన ఇండ్ల కేటాయింపు తదితర అంశాలపై మంగళవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మైనార్టీ సంక్షేమ శాఖ మిగతా2లో...




## కఠిన షరతులతో ఐబొమ్మ రవికి బెయిల్

### ఇంటర్నెట్ వాడడానికి నిషేధం

### కోర్టుక పాస్ పోర్టు సరెండర్

### విదేశాలకు వెళ్లడానికి వీల్లేదు

**హైదరాబాద్,ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** టాలీవుడ్‌తో పాటు ఇతర చిత్ర పరిశ్రమలను వణికించిన పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' వ్యవస్థాపకుడు రవికి న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అయితే, ఈ బెయిల్ సాధారణంగా కాకుండా అత్యంత కఠినమైన నిబంధనలతో కూడి ఉండటం గమనార్హం. గత కొంతకాలంగా సాగుతున్న విచారణ అనంతరం, ఆయనకు ఉపశమనం కలిగిస్తూ బెయిల్ మంజూరు చేస్తూ, భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి చర్యలకు పాల్పడకుండా కోర్టు పలు ఆంక్షలు విధించింది.ప్రధానంగా రవి ఇంటర్నెట్ వినియోగంపై కోర్టు పూర్తిస్థాయిలో ఆంక్షలు విధించింది. మిగతా2లో...

## తెలంగాణ భవన్‌లో కెసిఆర్ జన్మదిన వేడుకలు

- 72 కిలోల కేక్ కట్ చేసిన పార్టీ నేతలు
- తెలంగాణ ఉద్యమ నేపథ్య పాటలు, డాక్యుమెంటరీ విడుదల
- కెసిఆర్ మళ్లీ సిఎం అవుతారన్న మాజీమంత్రి తలసాని
- ముమ్మాటికీ కెసిఆర్ మాత్రమే తెలంగాణ జాతిపిత అన్న కెటిఆర్



**హైదరాబాద్,ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు మంగళవారం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ , యువ నాయకులు తలసాని సాయి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు అతిథులుగా హాజరయ్యారు. కేసీఆర్ 72 వ జన్మదినాన్ని పురస్కరించుకుని 72 కిలోల భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, తెలంగాణ ఉద్యమం నేపథ్యంతో రూపొందించిన పాటలు, డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తన ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప వ్యక్తి గా కేసీఆర్‌చరిత్రలో నిలిచిపోతారని అన్నారు.పదేళ్ల పాలనలో దేశం అబ్బురపడే విధంగా అనేక పథకాలు అమలు చేసిన ఘనత కేసీఆర్ దక్కుతుందని పేర్కొన్నారు. అధికారం ఎవరికీ మిగతా2లో...

ఆ

# గ్లోబల్ మ్యానుఫాక్చరింగ్ కేంద్రంగా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

పాలసీతో ముందుకు వెళుతున్నామని అన్నారు. గత రెండు సంవత్సరా ల్లోనే, జీవవిజ్ఞాన రంగంలో రూ.73,000 కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. కొద్ది వారాల క్రితం దావోస్‌లో మా కొత్త లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించాం.. జీనోమ్ వ్యాలీని విస్తరించాం.. ప్రపంచ స్థాయి పరిశోధన, ఆవిష్కరణలకు 'వన్-బయో'ను ప్రారంభించాం.. గ్రీన్ ఫార్మా సిటీని వేగవంతం చేసాం? అనేక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లను ఆహ్వానించామని తెలిపారు. ఇది సాధారణ అభివృద్ధి కాదు.. ఇది దృఢమైన దృష్టి ఫలితమని వెల్లడించారు. దానికి ప్రత్యక్ష సాక్ష్యం బయోఏషియా 2026 అని సీఎం తెలిపారు. ఈ సభను చూస్తుంటే నేను గర్వంగా చెప్పగలను.. బయోఏషియా తన పేరును దాటి, బయో-వరల్డ్‌గా మారుతోందని సీఎం రేవంత్ తెలిపారు. ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా ఉన్న 500 ప్రముఖ సంస్థలకు చెందిన 4,000 మందికి పైగా ప్రతినిధులు ఇక్కడ హాజరయ్యారు.. ఫార్మా, బయోసైన్సెస్, బయోటెక్, బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, ఆరోగ్య రంగాల్లో ప్రముఖులు, బిజినెస్ లీడర్స్ మనతో ఉన్నారని తెలిపారు. సైన్స్, ఏఐ బయోటెక్ వంటి రంగాల్లో ప్రముఖులను కలిసినప్పుడు అసాధారణమైన ఫలితాలు వస్తాయన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న బయోఏషియా సదస్సు దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం లాంటి అంతర్జాతీయ గుర్తింపు పొందుతుందన్న నమ్మకం నాకు ఉందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. తెలంగాణతో పాటు ముఖ్యంగా జీవవిజ్ఞాన రంగంపై మా దృష్టిని మీతో పంచుకుంటాను. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడం మా లక్ష్యమన్నారు. ప్రస్తుత జీవ విజ్ఞాన ధోరణులను చూస్తే పరిశోధన సంస్థలు, కార్పొరేట్లు, స్టార్టప్‌లు, చిన్న మధ్య తరహా సంస్థలు, ప్రభుత్వం మధ్య బలమైన భాగస్వామ్యం అవసరమని తెలిపారు. మీరు విశ్వసనీయమైన, స్థిరమైన, భవిష్యత్తు కోసం మంచి వాతావరణాన్ని కోరుకుంటున్నారు. తెలంగాణ అలాంటి వాతవరణాన్ని కల్పిస్తుంది. దీనికి సమాధానం హైదరాబాదేనని అన్నారు. బల్క్ డ్రగ్స్ నుండి బయాలజిక్స్ వరకు, తయారీ నుండి ఆవిష్కరణ వరకు, భారతదేశం నుండి ప్రపంచ స్థాయి వరకు తెలంగాణ ముందుకు సాగుతోందన్నారు. మేము కేవలం భారతదేశంలోనే పోటీ పడటం లేదు, ప్రపంచంలోని అగ్రగామి క్లస్టర్లతో పోటీ పడుతున్నామని తెలిపారు.

# తెలంగాణ గ్రామీణ క్రీడా రంగానికి సాంకేతిక హంగులు

(మొదటి పేజీ తరువాయి)

వ్యవస్థ ఏర్పాటు చేయడం సంతోషకరమని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఆయన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్లో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండో విడత సిఎం కప్ ఆప్‌ను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఎండి డాక్టర్ సోని బాలాదేవి లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ క్రీడా రంగానికి పెద్ద పీట వేసే లక్ష్యంతో మట్టిలో మాణి క్యాలను గుర్తించే విధంగా తెలంగాణ క్రీడా శాఖ సీఎం కప్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. యువకులు, విద్యా ర్థులు వ్యసనాల బారిన పడకుండా మైదానాలకు తరలి రావాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో దాదాపు నాలుగున్నర లక్షల మంది క్రీడాకారులు గ్రామీణ మండల అసెంబ్లీ జిల్లా స్థాయిలో పాల్గొని అందులోంచి 22,000 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమని అన్నారు. క్రీడాకారు లకు ఎప్పటి కప్పుడు సమాచారాన్ని తెలియజేసే విధంగా సీఎం కప్ గేమ్స్ పేరిట నీలమణి యాప్ ద్వారా ఏఐ కాల్ సెంట ర్ ద్వారా 24 గంటల సమాచా రాన్ని క్రీడాకారులకు అందుబాటులో ఉంచడం అభినందనీయమని అన్నారు.

# తెలంగాణ భవన్‌లో కెసిఆర్ జన్మదిన వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

శాశ్వతం కాదని, అధికారంలో ఉన్నామని దౌర్జన్యాలు చేస్తామంటే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలకు గతంలో ఏ ముఖ్యమంత్రి ప్రచారం చేయలేదని, కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రచారం నిర్వహించిన, దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడిన చెప్పుకోదగ్గ ఫలితాలు కాంగ్రెస్ పార్టీ సాధించలేదని విమర్శించారు. మూడేళ్ళ తర్వాత వచ్చేది తమ ప్రభుత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, సుధీర్ రెడ్డి, తెలంగాణ భవన్ ఇంచార్జి రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యమ కారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏ జాతి నీది? ఏ జాతికి జాతిపిత అని అడిగిన సన్నాసికి ఇవన్నీ చెప్తా ఉన్నా. తెలంగాణలో రెండే జాతులు ఉన్నాయి. ఒకటి తెలంగాణ వాదుల జాతి, రెండవది తెలంగాణ ద్రోహుల జాతి. మాది ఫైటెర్ల జాతి, మీది ట్రెయిటర్ల (ద్రోహుల) జాతి. మాది కేసీఆర్ లాంటి టైగర్ల జాతి, నీది మరి ట్రెయిటర్ల జాతి' గుర్తుపెట్టుకో.. కేసీఆర్ ఎన్నడూ చెప్పుకోలేదు నేను జాతిపితనని. ప్రజలు పిలుచుకున్నారు. ఎవరైతే స్వాతంత్ర్యం తెచ్చిండో తమ జాతికి, ఆయనను జాతిపితగా ప్రజలు పిలుచుకు ంటున్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. పెద్దమనిషి, మా తెలంగాణకు బాపు లాంటి పెద్దమనిషి కాబట్టే ఇవాళ మేము గర్వంగా చెప్తున్నాం సర్వసాధారణంగా ఏ తండ్రి అయినా ఆ కొడుకుకు, ఆ పిల్లలకు హీరోగా ఉంటారు. కానీ నా తండ్రి ఇవాళ తెలంగాణకు హీరో, అది తెలంగాణ జాతికి మొత్తానికి హీరో. ఇది వాస్తవం. కొంతమంది మాట్లాడుతున్నారు ఆనవాళ్లు చెరిపేస్తామని. కేసీఆర్ జన్మదిన సందర్భంగా నేను చెప్తా ఉన్నా తెలంగాణనే కేసీఆర్ ఆనవాళ్లు కదా..! తెలంగాణ రాష్ట్రమే కేసీఆర్ ఆనవాళ్లు కదా..! దాన్ని ఎట్లా చెరిపేస్తావురా సన్నాసి..? నువ్వు మమ్మల్ని ఎన్ని తిట్టినా, ఎన్ని బూతులు మాట్లాడినా ఒకటి మాత్రం వాస్తవం.. ఆయన ఒక శిఖరం, నువ్వు ఒక శునకం. నీ స్థాయి గదే, నీ బతుకు గదే. అందుకే నీకంటే ఇవాళతెలంగాణలోపుట్టిన ప్రతి బిడ్డకు తెలుసనన్నారు.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ తో కలిసి సమీక్షించారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి విపి గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు పాల్గొన్నారు. పట్టణాల్లోని మురికివాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడు తున్నారని ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో ఇండ్లు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని హైదరాబాద్‌కు దూరంగా గతంలో 42వేల ఇండ్లను నిర్మించగా అందులో సగం మంది మాత్రమే అక్కడ నివసిస్తున్నారని ఇటీవల నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో తేలిందని సమావేశంలో అధికారులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే చాలాచోట్ల బోగస్ లబ్ధిదారులు కూడా ఉన్నారని అధికారులు మంత్రులకు వివరించారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా ,నిరుపేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా, వారి నివాస ప్రాంతాలకు దగ్గరగా స్థానిక పరిస్థితులను బట్టి ఐదు నుంచి 10 అంతస్థుల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలనే ఆలోచన చే?స్తున్నామని ,వచ్చే క్యాబినెట్ సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ముగ్గురు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, నాలుగు జిల్లాల కలెక్టర్లు సమన్వయంతో వారి వారి ప్రాంతాలలో స్థలాలను గుర్తించి ఎన్ని ఇండ్లు నిర్మించవచ్చు, ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారు వంటి వివరాలతో పదిరోజుల్లో నివేదిక అందజేయాలని ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మురికివాడల్లో స్థలం ఉన్నవారు అంగీకరిస్తే ఆ ప్రాంతంలో జీప్లస్ 5 వరకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి అభివృద్ధి చేయాలన్న ఆలోచన చేస్తున్నామని జేఎన్‌ఎన్‌యూ ఆర్ ఎం పథకంలో నిర్మించిన ఇండ్లు శిధిలావస్థకు చేరాయని వాటి స్థానంలో కూడా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే ఆలోచన చేస్తున్నామన్నారు. మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఇండ్ల స్థలాలు ఉన్న 28వేల మంది లబ్ధిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న, ఇప్పటికే పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మార్చి చివరినాటికి లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆయా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న ఇండ్లకు లబ్ధిదారులను గుర్తించి ఆ లబ్ధిదారులే ఆ ఇండ్లను పూర్తి చేసుకోవడానికి అంతకుముందు ఖర్చుచేసిన మొత్తాన్ని పరిగణనలోకి తీసుకొని మిగిలిన నిధులను హౌసింగ్ కార్పొరేషన్ నిధులను మంజూరు చేస్తుందని తెలిపారు. చాలా చోట్ల ఇండ్లు తీసుకొని అక్కడ నివాసం లేని వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని , అలాగే బోగస్ లబ్ధిదారులను కూడా గుర్తించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనర్హుల స్థానంలో రాజకీయాలకు అతీతంగా సమీపంలో ఉన్నఅర్హులైన పేదలను ఎంపిక చేయాలని కలెక్టర్లకు సూచించారు. 2 బిహెచ్‌కే నివాస ప్రాంతాలలోని ప్రతి ఇంటికి తాగునీరు, విద్యుత్, డ్రైనేజ్ వంటి కనీస వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ మీటర్లను లబ్ధిదారుల పేర్లకు బదిలీ చేయాలని అలాగే 2బిహెచ్‌కే కాలనీల్లో తాగునీటి సరఫరా మౌలిక సదుపాయాలు, ఎస్టీపీలు, మరియు యూజీడీల వ్యవస్థ హైదరాబాద్ వాటర్ బోర్డు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఓర్,ఆర్, ఆర్, – ఓ ఆర్ ఆర్ మధ్య అఫర్డ్‌బుల్ హౌసింగ్ పాలసీ ఆర్,ఆర్, ఆర్, – ఓ ఆర్ ఆర్ పరిధిలో మధ్యతరగతి ప్రజల కోసం గతంలో కెపిహెచ్‌బిలో నిర్మించిన మాదిరిగానే ఇండ్లను నిర్మిస్తామని ఇందుకు నాలుగు ప్రాంతాల్లో స్థలాలను గుర్తించి పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

# కఠిన షరతులతో ఐబొమ్మ రవికి బెయిల్

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ఎలాంటి ఇంటర్నెట్ సౌకర్యాన్ని సొంతంగా వాడకూడదని, ఒకవేళ అత్యవసర పరిస్థితుల్లో వాడాల్సి వస్తే కేవలం పోలీసుల ముందస్తు అనుమతితో మాత్రమే వినియోగించాలని స్పష్టం చేసింది. దీనితో పాటు నిందితుడు దేశం విడిచి వెళ్లకుండా కట్టడి చేస్తూ, ముందస్తు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లకూడదని ఆదేశించింది. భద్రతా చర్యల్లో భాగంగా రవి తన పాస్‌పోర్ట్‌ను వెంటనే కోర్టులో డిపాజిట్ చేయాలని న్యాయస్థానం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.కొత్త సినిమాలు విడుదలైన గంటల్లోనే వాటిని తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తూ చిత్ర పరిశ్రమకు కోట్లాది రూపాయల నష్టాన్ని చేకూర్చారనే ఆరోపణలపై రవి అరెస్ట్ అయ్యారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉన్నందున, ఆయన మళ్లీ వెబ్‌సైట్ నిర్వహణ లేదా పైరసీ పనులు చేపట్టకుండా ఉండేందుకే కోర్టు ఇంటర్నెట్‌పై ఇటువంటి అరుదైన, కఠినమైన ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది.

# జెఇఇ మెయిన్ పరీక్షలో మెరిసిన బీసీ విద్యార్థులు

(మొదటి పేజీ తరువాయి)

మరో 28మంది విద్యార్థులు 80 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించారు. బాలికల విభాగంలో ఏ. నిత్య (92.19) , సిహెచ్ గాయత్రి ( 91.50), ఎం. సహస్ర ( 87.69), పి. చరిత(86.20), ఎం. స్నేహ(85.09) పర్సంటైల్ సాధించారు. బాలుర విభాగంలో ఎం. నరేందర్(91.58), ఆర్ . కౌశిక్ (91.25), బి.మల్లేష్( 90.50), బి.హరీష్ (89.19), డి.రోహన్(88.05) పర్సంటైల్ సాధించారు. గతంలో రెండు సీఓఈ లలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు కోచింగ్ ఇస్తుండగా తమ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పది సీఓఈ లను ఏర్పాటు చేయడమే కాకుండా లాంగ్ టర్మ్ కోచింగ్ కూడా ఇస్తున్నదని ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థులు అధిక సంఖ్యలో పోటీ పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించారని, రానున్న రోజుల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ఆకాంక్షించారు. అత్యుత్తమ ప్రతిభను చూపిన విద్యార్థినీ, విద్యార్థులను, బోధనా సిబ్బందిని మంత్రి , బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఈ. శ్రీధర్ , ఐఎఎస్, ఎంజెపి సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు ఐఎఫ్ఎస్ అభినందించారు.

# విశాఖకు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

(మొదటి పేజీ తరువాయి)

ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ( ఐఎఫ్ఆర్)లో పాల్గొనేందుకు ఆమె విశాఖకు చేరుకున్నారు. రేపు జరుగనున్న కార్యక్రమంలో ఏపీ సీఎం నాయుడుతో పాటు రాష్ట్ర గవర్నర్, డిప్యూటీ సీఎం, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్ తదితరులు హాజరు కానున్నారు.

# కృత్రిమ మేధ కళ్లద్దాలు

(మొదటి పేజీ తరువాయి)

స్థాపించారు. గ్లాసెస్ గురించి ప్రత్యూష్ ఒక వీడియోను షేర్ చేశారు. ఆ గ్లాసెస్‌కు 'సర్వం కేజ్' అని పేరుపెట్టారు. ఆ తర్వాత మోదీ ఆ అద్దాలను ధరించిన ఫొటోను షేర్ చేశారు. 'వాటిని ధరించిన మొదటి వ్యక్తి ఎవరో తెలుసా..? ప్రధానమంత్రి' అని ప్రత్యూష్ తన పోస్టులో రాసుకొచ్చారు. అది ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో దిగిన చిత్రంగా తెలుస్తోంది. సర్వం కేజ్ కళ్లద్దాలను భారత్‌లోనే అభివృద్ధి చేశామని కుమార్ వెల్లడించారు. ఇది తొలి స్వదేశీ ఏఐ హార్డ్‌వేర్ అని పేర్కొన్నారు. 'ఇది యూజర్ రియల్ వరల్డ్‌లో చూసేవాటిని గమనిస్తుంది.. అర్థం చేసుకుంటుంది.. ప్రతిస్పందిస్తుంది.. క్యాప్చర్ చేస్తుంది' అని వాటి పనితీరు గురించి వివరించారు. త్వరలో వాటికి చాట్ ఫీచర్‌ను కూడా తీసువస్తామని చెప్పారు. ఏఐ గ్లాసెస్‌ను తమ అవసరాలకు అనుగుణంగా కస్టమైజ్ చేసుకోవచ్చు. మేలో ఈ ప్రొడక్ట్ మార్కెట్‌లోకి రానుంది.ప్రపంచవ్యాప్తంగా ఈ స్మార్ట్ గ్లాసెస్ పై ఆసక్తి పెరుగుతోంది. మెటా ఇప్పటికే 'రేబ్యాన్ మెటా' పేరిట గ్లాసెస్‌ను లాంచ్ చేసింది. 2025లో 7మిలియన్ల గ్లాసెస్‌ను విక్రయించింది. త్వరలో యాపిల్ సంస్థ కూడా ఈ తరహా గ్లాసెస్‌ను తీసుకురానుంది. భారత వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఏఐ నమూనాలపై పనిచేస్తోన్న సంస్థల్లో సర్వం కూడా ఒకటి. ఈ సంస్థ ఇప్పటికే సర్వం అక్షర్ , సర్వం స్టూడియో సారస్ వీ3 ని తీసుకువచ్చింది.

# పెళ్లికి ముందే శారీరక సంబంధాలు సరికాదు

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. వివాహానికి ముందు ఏర్పరచుకునే శారీరక సంబంధాల విషయంలో యువత అత్యంత అప్రమత్తంగా ఉండాలని సుప్రీంకోర్టు సూచించింది. ఒక వ్యక్తి గురించి పూర్తిగా తెలియకుండా లైంగిక సంబంధంలోకి వెళ్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించిన ధర్మాసనం, పెళ్లికి ముందు ఎవరినీ సులభంగా నమ్మకూడదని స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలు చేయడానికి కారణమైన కేసు వివరాల్లోకి వెళితే.. 2022లో ఒక మ్యాట్రిమోనీ సైట్ ద్వారా ఒక యువతికి ఓ యువకుడు పరిచయమయ్యాడు. తాను పెళ్లి చేసుకుంటానని ఆమెను నమ్మించి, పలుమార్లు శారీరక సంబంధం పెట్టుకున్నాడు. అయితే, సదరు యువకుడికి అప్పటికే రెండు పెళ్లిళ్లు అయ్యాయని బాధితురాలికి ఆలస్యంగా తెలిసింది. దీనిపై ఆమె నిలదీయగా, తమకు సంబంధించిన ప్రైవేట్ వీడియోలను బయటపెడతానని అతడు బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు అతనిపై అత్యాచారం కేసు నమోదు చేశారు.ఈ కేసులో నిందితుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఘాటుగా స్పందించింది. ఒకరి గురించి పూర్తి సమాచారం లేకుండా అంతటి సాన్నిహిత్యం ఏర్పరచుకోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించింది. పెళ్లి పేరుతో జరిగే ఇలాంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోర్టు ఈ సందర్భంగా గుర్తు చేసింది.

# లాటరీలో తొర్రూరును కొట్టేసిన కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ 7 గెలుచుకోగా.. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఎంపీ కడియం కావ్యల ఎక్స్‌అఫీషియో ఓట్లతో కాంగ్రెస్ సంఖ్య 9కి పెరిగింది. రెండు పార్టీల బలాలు సమానం కావడంతో అధికారులు లాటరీ ద్వారా ఛైర్మన్‌ను నిర్ణయించారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి శ్రావణ్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఎంపీ కడియం కావ్య ఎక్స్‌అఫీషియో ఓటు చెల్లదంటూ బీఆర్ఎస్ శ్రేణులతో ఆందోళనకు దిగిన దయాకర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయన్ను నర్సింహులుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో ఎర్రబెల్లి మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు.అయితే, తన రాజకీయ కంచుకోటగా భావించే తొర్రూరు మున్సిపాలిటీ చేజారిపోవడంతో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర భావోద్వేగానికి లోనై మీడియా ముందే కన్నీళ్లు పెట్టుకున్నారు. తొర్రూరులో బీఆర్ఎస్ ఓటమిని జీర్ణించుకోలేకపోయిన ఎర్రబెల్లి దయాకర్ రావు కార్యకర్తల కష్టాన్ని తలుచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ప్రాణాలకు తెగించి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు నేను ఇప్పుడు ఏం సమాధానం చెప్పాలని అంటూ ఆయన కంటతడి పెట్టారు. నాయకులు కేసీఆర్ అంటే ప్రజల్లో ఎంత అభిమానం ఉన్నా, అధికార పార్టీ సాగిస్తున్న అరాచకాలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలీసుల వ్యవహారశైలిని ఎర్రబెల్లి తీవ్రంగా తప్పుబట్టారు. పోలీసులు కూడా అధికార పార్టీకి తొత్తులుగా మారి పనిచేయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ప్రస్తుతం జరుగుతున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే దీనికి ముగింపు పడుతుందని ఆయన హెచ్చరించారు. బీఆర్ఎస్ శ్రేణులు ఈ సందర్భంగా 'జై తెలంగాణ' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.

# 19న ఢిల్లీకి సిఎం రేవంత్ బృందం

- కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీకి పిలుపు
- కేబినేట్‌లో మార్పులు, చేర్పులుపై ఊహాగానాలు

**హైదరాబాద్,ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ బృందం ఈ నెల 19న ఢిల్లీకి వెళ్లనుంది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మారుతున్న రాజకీయ సమీకరణలు, పార్టీ బలోపేతం , భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు ఏఐసీసీ అగ్ర నాయకత్వం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రివర్గంలోని పలువురు కీలక మంత్రులు ఈ పర్యటనలో పాల్గొనబోతున్నారు. వీరితో పాటు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా ఈ సమావేశంలో భాగస్వామి కానున్నారు. 19వ తేదీ ఉదయం ఢిల్లీకి చేరుకోనున్న వీరు, కాంగ్రెస్ అగ్ర నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ , కేసీ వేణుగోపాల్‌తో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. రాష్ట్రంలో పాలన మొదలై రెండేళ్లు దాటిన క్రమంలో, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిపై నివేదిక ఇవ్వనున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఈ భేటీ తర్వాత తెలంగాణ క్యాబినెట్‌లో మార్పులు లేదా చేర్పులు ఉండొచ్చనే ఊహాగానాలు కూడా రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ఖాళీల భర్తీతో పాటు పలువురి మంత్రి పదవుల్లో మార్పులు చేర్పులు చోటుచేసుకునే వీలుందని అంటున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలవుతున్న సంక్షేమ పథకాలు, ముఖ్యంగా గ్యారెంటీల అమలు తీరుపై అధిష్టానం సమీక్షించనుంది. అలాగే ఇటీవల వరుస ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాలపైనా కాంగ్రెస్ అగ్రనాయకత్వం సంతృప్తితో ఉంది. ప్రభుత్వ పనితీరుతో పాటు పార్టీ నిర్మాణం, సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయడం , పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీపై అధిష్టానం దిశానిర్దేశర చేయనుంది. అలాగే విపక్షాల విమర్శలను సమర్ధవంతంగా తిప్పికొట్టడం , భవిష్యత్తు ఎన్నికల వ్యూహాల గురించి రాహుల్ గాంధీ స్వయంగా నాయకులకు సూచనలు చేసే అవకాశం ఉంది. కాంగ్రెస్ అధిష్టానం ప్రస్తుతం వివిధ రాష్ట్రాల నాయకులతో వరుస సమావేశాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగానే 19వ తేదీ ఉదయం తెలంగాణ నేతలతో సమావేశమై, అదే రోజు సాయంత్రం మహారాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంతో భేటీ కానుంది. రాష్ట్రంలో పార్టీ స్థితిగతులను మెరుగుపరచడంతో పాటు, ప్రభుత్వం , పార్టీ మధ్య సమన్వయాన్ని పెంచడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.

## ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను
# కలసిన జేపీసీ నాయకులు





**ధర్మసాగర్,ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఎన్ హెచ్ ఎం జేపీసీ తలపెట్టిన ప్రజా ప్రతినిధుల ములాఖత్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో హెల్త్ డిపార్ట్మెంట్ కి పెద్ద దిక్కు అయినా హెల్త్ మినిస్టర్ శ్రీ దామోదర రాజనర్సింహ ని మినిస్టర్ హెడ్ క్వార్టర్ లో కలిసి ఎన్ హెచ్ ఎం ఉద్యోగస్తులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అలాగే పెండింగ్లో ఉన్న వేతనాల గురించి మరియు ఎన్నో సంవత్సరాల కల అయినా రెగ్యులరైజేషన్ గురించి చర్చించి వివిధ రాష్ట్రాలలో రెగ్యులర్ అయిన జీవోలను వారికి సమర్పించడం జరిగినది. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ మీ డిమాండ్లను త్వరితగతిన పూర్తి చేయిస్తానని హామీ ఇవ్వడం జరిగినది. అలాగే తెలంగాణ డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాష్ ని అలాగే రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మరియు బిసి వెల్ఫేర్ మంత్రివర్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగినది. వారి ఇరువురు కూడా స్పందిస్తూ మీ రెగ్యులరైజేషన్ గురించి ప్రభుత్వ దృష్టిలో ఉంది అని గుర్తు చేసుకుంటూ అలాగే చీఫ్ మినిస్టర్ రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని సానుకూలంగా స్పందిస్తూ హామీ ఇవ్వడం జరిగినది. ఇది ఇలా ఉండగా ప్రజా ప్రతినిధులు అందరూ ఎన్ హెచ్ ఎం ఉద్యోగస్తులు అందరూ కరోనా కష్టకాలంలో ప్రజల ఆరోగ్యాలను కాపాడారని గుర్తు చేయడం గమనరహం . నేషనల్ హెల్త్ మిషిన్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ, ఈ ప్రభుత్వంలోనైనా రెగ్యులరైజ్ అయితమని నమ్మకంతో ఉన్నామని తెలియజేశారు.ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర కోర్ కమిటీ మెంబర్స్ డాక్టర్ మహేందర్ రావు పుట్ట, డాక్టర్ శ్రీనివాస్ , డీపీఓ రుక్మద్దీన్ , ఎండి గౌస్ పాషా , అలాగే రాష్ట్ర సోషల్ మీడియా ఇన్చార్జ్ ఎం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ సర్పంచుల శిక్షణ కార్యక్రమం

**గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం**

**బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి**

**గ్రామపంచాయతీల నిర్వహణకు 500 కోట్ల రూపాయల నిధులు మంజూరు: మంత్రి సీతక్క**





**ములుగు జిల్లా,ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని,గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్ ల పాత్ర కీలకంగా ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.మంగళవారం ములుగు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో నూతనంగా ఎన్నికైన ములుగు, వెంకటాపూర్, మల్లంపల్లి,గోవిందరావుపేట 4 మండలాల సర్పంచ్ లకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమ ప్రారంభానికి మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్ట్ తయారీ ,తడి చెత్త పొడి చెత్త నిర్వహణ స్టాల్ లను మంత్రి పరిశీలించారు.అనంతరం ములుగు,మల్లంపల్లి మండలకు చెందిన 75 మంది లబ్ధిదారులకు మంత్రి సీతక్క కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారుఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలు అని, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సర్పంచుల పాత్ర కీలకంగా ఉంటుందని, నూతనంగా ఎన్నికైన సర్పంచులకు పంచాయతీ రాజ్ చట్టం పై తప్పనిసరిగా అవగాహన ఉండాలని, పాలకులుగా ఉంటూ సేవకులుగా ప్రజలకు సేవ చేయాలని అన్నారు.గ్రామాల లో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూడాలని,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే నిధులకు అందరికీ ఉపయోగపడే పనులకు ఖర్చు చేయాలని,గ్రామ అభివృద్ధి పై పాలక మండలి ఆధ్వర్యం లో గ్రామ సభలు నిర్వహించాలని, ఉపాధి హామీ పథకం లో కార్మికుల సంఖ్య పెంచేలా చూడాలని అన్నారు.సుమారు 500 కోట్ల రూపాయల నిధులను గ్రామ పంచాయతీ లకు అందించడం జరిగిందని తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలకు ఎలాంటి మౌలిక వసతులు కల్పించాలి అనే అంశాల పై ప్రత్యేక బృందాలతో సర్వే నిర్వహించడం జరుగుతుందని, సర్పంచులకు మరిన్ని అదనపు బాధ్యతలు కల్పించి బాల్యవివాహాల నిర్మూలన, గ్రామాలలోని అత్యంత పేదరిక లో ఉన్న వారిని గుర్తించడం,మహిళ సంఘాలను ప్రోత్సహించడం, అభివృద్ధి పై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అన్నారు.శిక్షణ తరగతులకు విచ్చేసిన నూతన సర్పంచులకు పంచాయతీ రాజ్ చట్టం గూర్చి,అదేవిధంగా సర్పంచుల విధులు వారి బాధ్యతలపై ఐదు రోజులపాటు స్పష్టమైన అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంధాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి జిల్లా పంచాయతీ అధికారి, ఆత్మ కమిటీ చైర్మన్ , ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ములుగు జిల్లాలోని మండలాలకు ఇంచార్జీలను ప్రకటించిన ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్



**ములుగు జిల్లా,ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఇటీవల జరిగిన సర్పంచ్ మరియు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి భారీ విజయాలను వరించడంలో కీలక పాత్ర కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలదే...లిగ్రామస్థాయి నుండి ఇంకా పటిష్టంగా కాంగ్రెస్ పార్టీని విస్తరించాలనే ఉద్దేశంతోనే మండల ఇంచార్జీల ప్రకటన...లిగ్రామస్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలి...లి ప్రతి గ్రామంలో ఎప్పటికప్పుడు మారుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ బలోపేత దిశగా ఇంచార్జులు అడుగులు వేయాలి...లిప్రతి మండలంలోని సమస్యలపై దృష్టి సారించి, సమస్యలను పరిష్కార దిశగా అడుగులు వేసి కాంగ్రెస్ పార్టీ చరిష్మను తెలియజేయాలి...లి కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ స్థానాన్ని ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచేలా కష్టపడాలి... ములుగు జిల్లాలోని అన్ని మండలాలకు కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం మండల ఇంచార్జీలను ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ గారు ప్రకటించారు. మండల ఇంచార్జులు:1. ములుగు మండలం బానోత్ రవి చందర్, కుంజా సూర్యా రామ్, మారం సుమన్ రెడ్డి2. వెంకటాపూర్ మండలంగొల్లపల్లి రాజేందర్ గౌడ్, కొండం రవీందర్ రెడ్డి3. గోవిందరావుపేట మండలంబైరెడ్డి భగవాన్ రెడ్డి, ఎండి. ఇస్సార్ ఖాన్4. తాడ్వాయి మండలంగుమ్మడి సోమయ్య, కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, తాజుద్దీన్5. ఏటూరునాగారం మండలంచెట్టుపల్లి వెంకటేశ్వర్లు, అర్రెం లచ్చుపటేల్6. కన్నాయిగూడెం మండలంరేగ కళ్యాణి, అయ్యోరి యానయ్య 7. మంగపేట మండలంగుడ్ల దేవేందర్, చిటమట రఘు, వసంత శ్రీనివాస్8. మల్లంపల్లి మండలంవంగ రవి యాదవ్, పల్లె జైపాల్ రెడ్డి గార్లను మండల ఇంచార్జులుగా ప్రకటించారు. మండల ఇంచార్జీలు వారి మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేయాలని, పార్టీలో ఏవైనా అంతర్గత సమస్యలు ఉంటే అధిష్టానం దృష్టికి తీసుకువచ్చి, సమస్యలను పరిష్కరించాలని, కాంగ్రెస్ పార్టీని అన్ని విభాగాల్లో పటిష్ట పరచాలని సూచనలు చేశారు.

## బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి:కేంద్ర మంత్రి బండి సంజయ్...






**కరీంనగర్,ఫిబ్రవరి17(పీసీడబ్ల్యూ న్యూస్):** బాల్య వివాహాలను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతతో కృషి చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. సహాయ వెల్ఫేర్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ మరియు జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కోసం ఏర్పాటుచేసిన ప్రచార రథాన్ని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు .ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ బాల్యం అమూల్యమైన దశ అని, బాల్య వివాహాలు పిల్లల చదువు, ఆరోగ్యం, శారీరక–మానసిక అభివృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. చదువు మధ్యలో ఆగిపోవడం వల్ల జీవితాంతం ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని, బాలికల విద్యను ప్రోత్సహిస్తూ ఉచిత విద్యను అందుబాటులోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. పిల్లలు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సహాయ వెల్ఫేర్ అసోసియేషన్ స్వచ్ఛందా సంస్థ డైరెక్టర్ రాజ్ కమల్ రెడ్డి కోఆర్డినేటర్ పోలవేణి భూమేష్, భూపాలపల్లి కో ఆర్డినేటర్ తిరుపతి, ఒంటెల కరుణాకర్ రెడ్డి, బోయినిపల్లి ప్రవీణ్ కుమార్ కమ్యూనిటీ మొబిలైజర్లు లత, శ్యామల, లహరి, కోమలత, శ్రీలత, ప్రభా లత తదితరులు పాల్గొన్నారు.

# సిపిని కలసిన మండి బజార్ మర్చంట్

**● రంజన్ పండుగ సందర్భంగా పోలీస్ కమిషనర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన డిసిసి అధ్యక్షులు మహమ్మద్ అయూబ్**



**వరంగల్, ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రంజాన్ నెల ఉపవాసాల సందర్భంగా వరంగల్ మండి బజార్ మర్చంట్ అసోసియేషన్ వారిని కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు అయూబ్ తో సిపి ని కలవడం జరిగింది. ప్రతి సంవత్సరం లాగే పవిత్రమైన రంజాన్ మాసంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గతంలోగా ప్రశాంతమైన వాతావరణంలో రంజాన్ ఉపవాసాల నెల జరుపుకునే విధంగా ప్రభుత్వము పోలీస్ యంత్రాంగము మున్సిపాలిటీ సిబ్బంది తగిన ఏర్పాట్లు చేయాలని మరి ముఖ్యంగా రంజాన్ మాసంలో 24 గంటల పర్మిషన్ ఇవ్వాల్సిందిగా వరంగల్ సిపి సంప్రీత్ ను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ అయూబ్. మర్చంట్ అసోసియేషన్ వారు కలసి మర్యాదపూర్వకంగా వినతి పత్రం సమర్పించారు. ప్రతి సంవత్సరం లాగే అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ మా డిపార్ట్మెంటు మీకు సహకారం తప్పక ఉంటుందని. సిపి సంప్రీత్ హామీ ఇవ్వడం జరిగింది. వరంగల్ మున్సిపల్ కమిషనర్ ఏ రోజు చెత్త ఆరోజు శుభ్రం చేసుకుంటూ నగరంలోని అన్ని మసీదుల కూడా లైట్లను మరియు అన్ని విధాల ఏర్పాట్లను చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం సహకారంకు అధికారులకు మర్చంట్ అసోసియేషన్ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నాం కలిసిన వారిలో మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు రహీం, ప్రధాన కార్యదర్శి రఘురాం, క్యాషియర్ ఎజాజ్, కొయ్యడ ప్రభాకర్, కమల్ పాషా, మర్చంట్ సభ్యులు పాల్గొన్నారు

## ములుగు మాజీ సర్పంచ్ బండారు హరినాథంని కాంగ్రెస్ పార్టీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

**● జారీ చేసిన ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్**



**ములుగు జిల్లా,ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కాంగ్రెస్ పార్టీ నియమ, నిబంధనలను ఎవరు అతిక్రమించిన ఉపేక్షించేది లేదు...పార్టీ ప్రతిష్టను దిగజార్చాలని చూస్తే ఎవరిని క్షమించేది లేదు...పార్టీ కుటుంబం లాంటిది అని, పార్టీని మోసం చేస్తే కుటుంబాన్ని మోసం చేసినట్టే...ములుగు పట్టణ కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ బండారు హరినాథం గారిని కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేస్తూ ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ గారు ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం పైడాకుల అశోక్ గారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ఉంటూ కాంగ్రెస్ పార్టీని నష్టం చేసే ఎవరిని అయిన ఉపేక్షించేది లేదని, కాంగ్రెస్ పార్టీకి నియమ నిబంధనలు అనేవి ఉన్నాయని, నియమ నిబంధనలు ఎవరు ఉల్లంఘించిన తక్షణమే పార్టీ నుండి సస్పెండ్ చేస్తామని, కాంగ్రెస్ పార్టీ మన కుటుంబంలాంటిది అని, కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయాలని చూస్తే, మన కుటుంబాన్ని మనం దెబ్బ తీసినట్టే అని, పార్టీ లైన్ ఎవరు అతిక్రమించిన ఉపేక్షించేది లేదు అని, పార్టీలో ఉంటూ పార్టీని మోసం చేసిన వారు ఎంత పెద్దవారైనా వారిని క్షమించేది లేదని అన్నారు.

## దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ ఎన్. రవి




**హన్మకొండ,ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** వివిధ సర్టిఫికెట్స్ కోసం వచ్చే దరఖాస్తులను త్వరగా పరిష్కార చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలు లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశాల మేరకు జిల్లాలోని తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, ఆర్ఐలు, జిపిఓలతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో ముందుగా ఈడీఎం శ్రీధర్ మీసేవ ఫీల్డ్ వెరిఫికేషన్ మొబైల్ అప్లికేషన్‌పై జిపిఓలు, ఆర్ఐలకు అవగాహన కల్పించారు. ఆ తదుపరి మీసేవ పెండింగ్, భూభారతి, రెవెన్యూ సదస్సుల అప్లికేషన్స్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ అప్లికేషన్స్ సంబంధిత వాటి యొక్క తాజా పెండింగ్/స్థితిపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ త్వరితగతిన సర్టిఫికెట్స్ ను జారీ చేయాలని, గడువు దాటకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశములో డీఆర్వో వై. వి. గణేష్, తహశీల్దార్ లు, నాయబ్ తహశీల్దార్ లు, గిర్ధావర్లు, అన్ని మండలాల గ్రామ పాలన అధికారులు పాల్గొన్నారు.

## ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీలో సైడ్ కాలువల పూడిక తొలగింపు



**ములుగు జిల్లా,ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని సైడ్ కాలువల పూడిక తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు.సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు గారి ఆదేశాల శిమేరకు, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య గారి సూచనలతో, 4వ వార్డు సభ్యులు ఏంపెల్లి రాజు ఆధ్వర్యంలో ఈ శుభ్రత కార్యక్రమం నిర్వహించారు.గ్రామంలో నిల్వ నీరు లేకుండా చేయడం, దోమల వ్యాప్తిని నియంత్రించడం, పారిశు ధ్యాన్ని మెరుగుపరచడం ప్రధాన లక్ష్యంగా పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన మట్టి, చెత్తను తొలగించి నీటి ప్రవాహాన్ని సక్రమంగా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంతటి విజయ, బీఆర్ఎస్ మండల నాయకులు ఎం.డి. హరీఫ్, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొని సహకారం అందించారు.గ్రామాభివృద్ధి, ప్రజల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని వార్డు సభ్యులు ఏంపెల్లి రాజు తెలిపారు.

## పండుగలను మత సామరస్యంతో జరుపుకోవాలి

### - సత్తుపల్లి ఇన్స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరి



**సత్తుపల్లి, ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రంజాన్ పండుగను, ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో మత సామరస్యంతో జరుపుకోవాలని సత్తుపల్లి ఇన్స్పెక్టర్ శ్రీహరి శాంతి కమిటీ సభ్యులకు మంగళవారం పిలుపునిచ్చారు. రంజాన్, ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాల సందర్భంగా కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో మత సామరస్యాన్ని కాపాడటానికి పోలీసు స్టేషన్ ఆవరణలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.పండుగ వేడుకలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రార్థనల సమయంలో, శివాజీ జయంతి ఉత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులకు సహకరించాలని కమిటీ సభ్యులను, మత పెద్దలను కోరారు. శాంతి నెలకొల్పే విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడైతే శాంతిభద్రతలు సక్రమంగా ఉంటాయో అభివృద్ధి పథంలో ముందుంటామన్నారు. పండుగ వేడుకలు ప్రశాంతంగా సాగేందుకు ప్రజలు సమన్వయంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు, మత పెద్దలు పాల్గొన్నారు.

## గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగముగా





**గంగాధర ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధరలోని మధురానగర్ చౌరస్తాలో ఈరోజుతెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి వర్యులు గౌరవ శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు జన్మదినం సందర్భంగా గంగాధర మండల కేంద్రంలో మొక్క నాటిన బిఆర్ఎస్ నాయకులు ఠాగూర్ మండల నాయకులు నవీన్ రావు.మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేనలో భాగంగా కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కేంద్రంలో మొక్క నాటిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఠాగూర్ కార్యకర్తలు సందర్భంగా వారు మాట్లాడుతూ బి ఆర్ ఎస్ పార్టీ అధినేత గౌరవ శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు జన్మదినం పురస్కరించుకొని మొక్క నాటడం జరిగింది పర్యావరణ పరిరక్షణలో భాగంగా హరిత హారం చేపట్టి పచ్చని వాతావరణాన్ని తీసుకువచ్చారు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన నాయకునికి మరొక్క సారి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఇట్టి కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


## ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి: రాకేష్ గైక్వాడ్

**ప్రజా సమస్యలను పరిష్కరించరా..?**

**ప్రజావాణిలో వచ్చిన సమస్యలను పట్టించుకోరా..?**

**యువతకు ఇచ్చిన హామీలు ఎక్కడ..?**

**హైదరాబాద్ ఫిబ్రవరి 17(పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ జాగృతి హరి బౌలి డివిజన్ యువ నాయకుడు రాకేష్ గైక్వాడ్ అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలైన మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులు, దివ్యాంగులు సహా ఇతర పింఛన్లు పెంచాలని, కళ్యాణ లక్ష్మీతో పాటు తులం బంగారం ఇవ్వాలని, అంగన్ వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రజా భవన్ ఎదుట తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో రాకేష్ గైక్వాడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక హామీలను మరిచిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో నవీన్ కుమార్, రాజ్ కుమార్, ముఖేష్, నితిన్, శ్రీకర్ రాజు, ఓంకార్ బబ్లు, శ్రీ వాస్తు, రవి, మహేందర్ పాల్గొన్నారు.





# పవిత్ర రంజాన్ మాసంలో ప్రభుత్వం ద్వారా మౌలిక సౌకర్యాలు కల్పించండి

**ఇఫ్తార్ వేళల్లో ట్రాఫిక్ పోలీసుల తనిఖీల నుంచి, ట్రాఫిక్ చాలన్లను మినహాయించండి**

**పుట్ పాత్, చిరు వ్యాపారులు, హోటళ్లు, హరీస్ స్టాల్స్, కిరాణా షాపులు, ఫ్రూట్స్, కూరగాయల షాపులకు మినహాయింపు కల్పించండి**

**జిల్లా కలెక్టర్, సీపీ, మున్సిపల్ కమిషనర్ లకు, విద్యుత్ ఎస్ఈకి ఎంఐఎం నేతల వినతి పత్రం**





**కరీంనగర్ టౌన్ ఫిబ్రవరి 17(పిసిడబ్ల్యూ న్యూస్):** ఫిబ్రవరి 19వ నంచి పవిత్రమైన రమజాన్ మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో నగరంలోని అన్ని మస్జిదుల వద్ద, ముస్లిం కాలనీల్లో అధికారులు చేయాల్సినటువంటి ఏర్పాట్లపై కరీంనగర్ ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు, జిల్లా సీపీకి, నగరపాలక సంస్థ కమిషనర్ కు జిల్లా ట్రాన్స్కో ఎన్పీడీసీఎల్ ఎస్ఈలకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. రంజాన్ పండగ ఏర్పాట్లకు ప్రభుత్వం ద్వారా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రంజాన్ నెలలో నగరంలో ముస్లిం కాలనీల్లో, మస్జిద్ లలో త్రాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మసీదుల వద్ద నీటి ట్యాంకర్ల ఏర్పాటు చేయడంతో పాటు, నగరంలో నీటి ట్యాంకర్ల కొరత లేకుండా చూడాలని సూచించారు. నగరంలో మసీదుల వద్ద అదనపు క్లీనింగ్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఎక్కడ కూడా అపరిశుభ్ర వాతావరం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రైనేజి లను శుభ్రపరచాలని, మస్జిద్ లలో పనిచేస్తున్న ఇమామ్ లకు, మౌజన్ లకు జీతాలు రిలీజ్ చేయాలన్నారు. రంజాన్ నెల కోసం కరీంనగర్లో ఏర్పాటు చేసిన విధంగా అన్ని మున్సిపల్ ఏరియాలో గ్రామాలలో ఏర్పాటు చేయాలని కోరారు. దింతో పాటు నగరంలో కిరాణా షాపులు, ఫ్రూట్స్, కూరగాయలు, హోటల్స్, హరీస్ స్టాల్స్ లకు 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా చూడాలని , పుట్ పాత్ ల వద్ద అమ్ముకునే చిరు వ్యాపారులను పోలీసులు ఇబ్బందులు పెట్టకుండా చూడాలని జిల్లా కలెక్టర్ కు.. పోలీస్ కమిషనర్ కు నగరపాలక సంస్థ కమిషనర్కు ఎంఐఎం నేతలు విజ్ఞప్తి చేశారు. వేసవికాలం దృష్ట్యా రంజాన్ నెలలో నమాజ్ సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని అదనపు లోడ్ పడినపుడు ఇబ్బందులు లేకుండా ట్రాన్స్ ఫార్మర్ లు ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రీట్ లైట్స్ ఇబ్బందులు లేకుండా చూడడంతో పాటు మసీదుల వద్ద లైటింగ్ ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.. చెత్త సేకరణ పూర్తి స్థాయిలో చేపట్టాలని చెత్త సేకరణ ఆటోలు పూర్తిగా అన్ని కాలనీలో తిరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్, ఏసీపీ లు మాట్లాడుతూ రంజాన్ నెలను ప్రశాంతమైన వాతావరణంలో విజయవంతంగా జరుపుకోవాలని సూచించారు. మసీదుల వద్ద శామియానాలు, వాటర్ ఫెసిలిటీ, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. రంజాన్ నెలకు సంబంధించి ఏర్పాట్లపై త్వరలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. అన్ని కాలనిల్లో తాగునీటికి ఎక్కడ ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.. మంచినీటి ట్యాంకర్లు అదనంగా ఏర్పాటు చేయాలని సూచించారు..ఓవర్ లోడ్ పడినప్పుడు ఇబ్బందులు లేకుండా ట్రాన్స్ఫార్మర్లు అదనంగా ఉంచడంతో పాటు మొబైల్ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు.. అదనపు శానిటేషన్ టీమ్స్ ని ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ కి సూచించారు.. ఎంఐఎం నేతలు కోరిన విధంగా రంజాన్ మాసం సందర్భంగా షాపులు 24 గంటలు నడుపుకోవడాన్ని పరిశీలించాలన్నారు.. పుట్ పాత్ లపై ఉండే చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. రంజాన్ నెలలో ఇఫ్తార్ తో పాటు సహార్ సమయాల్లో తనిఖిల పేరుతొ, చాలన్ల పేరుతో ఇబ్బందులు కలిగించద్దని ట్రాఫిక్ పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని టౌన్ ఏసీపీకి కు ఎంఐఎం నేతలు విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, జాయింట్ సెక్రటరీలు హాఫీజ్ యూసుఫ్, ఆతిన, కోశాధికారి ఇబ్రహీం, కార్పొరేటర్లు మొహసీన్ మొహియుద్దీన్, మాజిద్ హుస్సేన్, నాయకులు బాబుజానీ, అరిఫ్ అహ్మద్, తాజుద్దీన్, షబ్బీర్, శ్రీనివాస్, రాజు, సురేశ్, సుధాకర్, అక్బర్, వాజిద్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు ఆదేశానుసారమే భూదాన భూముల్లో పేదల ఇళ్లు

**- న్యాయస్థానం ఆదేశాలను గౌరవించాలి**

**- పోలీసుల జోక్యం మానుకోవాలి**

**- ఇళ్లస్థలాలకు వెంటనే నీటి సౌకర్యం, విద్యుత్ వసతి కల్పించాలి**

**- జస్టిస్ బి.చంద్రకుమార్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి**




**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కోర్టు ఆదేశానుసారం భూదాన భూముల్లో పేదలు ఇళ్లస్థలాలను నిర్మించుకున్నారని, వారికి వెంటనే నీటి వసతి, కరెంట్ సౌకర్యం కల్పించాలని మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి డిమాండ్ చేశారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. 2014లో వెలుగుమట్ల భూదాన భూమిని పేదల ఇళ్లస్థలాల కోసం కేటాయించబడిందని, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ఆ పేదల ఇళ్లస్థలాలకు కనీస వసతులు ఏర్పాటు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడం వారిని అక్కడ నుండి వెళ్లగొట్టేందుకు పోలీసుల ద్వారా కొంత మంది అధికారులు బెదిరించే కార్యక్రమాలు చేయడం బాధాకరమని అన్నారు. భూదాన భూమిని కబ్జా చేసే ప్రయత్నంలో రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వారు ఉన్నట్లు ఆరోపించారు. అట్టి భూమి నుండి పేదలను భయభ్రాంతులకు గురిచేసి వెళ్లగొడితే ఆ భూమిని కబ్జా చేసే అవకాశం ఉంటుందని అనుకోవడం అమాయకత్వమన్నారు. జిల్లా అధికారులు కోర్టు ఆదేశాలను అనుసరించి వెలుగుమట్ల భూదాన భూముల్లో ఇళ్లస్థలాలు ఏర్పాటు చేసుకున్న వారికి తక్షణమే కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు పోలీసులు ఒత్తిడి చేసి పేదలను వెళ్లగొట్టాలని చూస్తే వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని, వారే బాధ్యులవుతారని హెచ్చరించారు. విజ్ఞతతో, రాజ్యాంగం ప్రకారం, కోర్టు ఆదేశాలను అనుసరించి వెలుగుమట్ల పేదలకు న్యాయం చేయాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. భూదాన భూములను అమ్మే హక్కు, కొనే హక్కు ఎవరికీ లేవని స్పష్టం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బడా రాజకీయ నాయకులు, కొంతమంది అధికారులు వెలుగుమట్ల భూములను ఆక్రమిస్తే న్యాయస్థానం ముందు ఎప్పటికైనా నిలబడక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో భారత, చైనా మిత్రమండలి ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ డాక్టర్ మోహన్ రెడ్డి, సీనియర్ న్యాయవాది లక్ష్మీనారాయణ, తెలంగాణ ఓపిడిఆర్ రాష్ట్ర కార్యదర్శి డి.విజయేందర్, లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు భద్రు నాయక్, బిసి, ఎస్సి, ఎస్టి జెఏసి నాయకులు రాంబాబు, భారత చైనా మిత్రమండలి ఆంధ్రప్రదేశ్ జనరల్ సెక్రెటరీ సుబ్బారెడ్డి, గ్రామీణ పేదల సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. వెంకటేశ్వరరావు, గ్రామీణ పేదల సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వెంకటాద్రి, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండా లింగయ్య, భారత కమ్యూనిస్ట్ విప్లవకారుల సమైక్యతా కేంద్రం (మార్క్సిస్ట్ లెనినిస్ట్) నాయకులు పోలెబోయిన ముత్తయ్య, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా అధ్యక్షులు రవీంద్రస్వామి న్యాయవాది తదితరులు పాల్గొన్నారు.





## ఏటూరు నాగారం మండలంలో బస్టాండ్ నుంచి బస్సు సౌకర్యం లేక ప్రజల అష్టకష్టాలు

**ములుగు జిల్లా,ఫిబ్రవరి 17(పిసిడబ్ల్యూ న్యూస్):** ఏటూరు నాగారం మండలంలో బస్టాండ్ నుంచి రామన్నగూడెం, రాంనగర్, పాప్కాపూర్, లంబడి తండా గ్రామాల వైపు నేరుగా వెళ్లే బస్సు సర్వీస్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నాలుగు గ్రామాల ప్రజలు ఎక్కడికి వెళ్లాలన్నా ముందుగా ఏటూరు నాగారం బస్టాండ్‌కు రావాల్సి వస్తోంది. అక్కడి నుంచి మరో బస్సు ఎక్కి అడవి మార్గం గుండా ప్రయాణం చేయాల్సి రావడంతో సమయం, డబ్బు రెండూ ఎక్కువగా ఖర్చువుతున్నాయి.అదే ఈ మార్గంలో నేరుగా బస్సు సర్వీస్ ఏర్పాటు చేస్తే, ప్రజలు సులభంగా ఎక్కి దిగే అవకాశం ఉంటుంది. దీంతో డబుల్ ఖర్చు తగ్గి, ప్రయాణ సమయం కూడా ఆదా అవుతుంది.ముఖ్యంగా ఈ ప్రాంతం నుంచి కమలాపూర్‌కు వెళ్లాలంటే ప్రస్తుతం అడవి మార్గంలో ప్రమాదకరంగా ప్రయాణించాల్సి వస్తోంది. అదే రామన్నగూడెం రాంనగర్ పాప్కాపూర్ లంబడి తండా మీదుగా బస్సు ఉంటే నాలుగు గ్రామాలు నేరుగా కలసి, కమలాపూర్‌కు సీదాగా చేరుకునే అవకాశం ఉంటుంది.ఇటువైపు ఆటో సౌకర్యం కూడా లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు.

## ఇన్స్పైర్ అకాడమీ విద్యార్థిని జేఈఈ మెయిన్‌లో ప్రతిభ

**హన్మకొండ, ఫిబ్రవరి 17(పిసిడబ్ల్యూ న్యూస్):**ఇటీవల ప్రకటించిన జేఈఈ మెయిన్ ఫలితాలలో ఇన్స్పైర్ అకాడమీ విద్యార్థిని తీగల సాయి శ్రేష్ఠిత 95.59 పర్సంటేజ్ స్కోర్ సాధించి కళాశాలకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా అకాడమీ చైర్మన్ తీగల భరత్ గౌడ్ విద్యార్థిని అభినందించారు.మొత్తం 20 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్ పరీక్షకు హాజరుకాగా, అందులో 6 మంది విద్యార్థులు మొదటి దశలో అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ సుంకరి శ్రీరామ్ రెడ్డి తెలిపారు. విద్యార్థుల కృషి, అధ్యాపకుల మార్గ దర్శకత్వం మరియు ప్రత్యేక శిక్షణ వల్ల ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన పేర్కొన్నారు. అర్హత సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు తీగల రాజకుమార్, కోటిచింతల మమత కుమారి, లాడే శివ అభినందించి, రాబోయే దశలో మరింత ప్రతిభ కనబరచాలని ఆశాభావం వ్యక్తం చేశారు.





## పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం: ప్రిన్సిపాల్ మేకల రమేష్..

**చిట్యాల ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల కళాశాలలో 2026 / 27 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతి లో అడ్మిషన్ పొందేందుకు దరఖాస్తులు ఆన్లైన్లో స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మేకల రమేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు అదే విధంగా ఏడో తరగతి నుండి పదవ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం కూడా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు దరఖాస్తులు ఫిబ్రవరి 28 తో ముగియనున్నందున చిట్యాల మండల మరియు జిల్లా విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు పూర్తి వివరాల కోసం సెల్ నెంబర్9885666783 ని సంప్రదించగలరని తెలియజేశారు

# భారత రత్న, జననాయక్ కర్పూరి ఠాకూర్ స్ఫూర్తితో సమన్యాయం

## ● వరంగల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మైదం జయపాల్



**వరంగల్ ఫిబ్రవరి 17(పిసిడబ్ల్యూ న్యూస్):** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయం కోసం పోరాడిన బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్ (1924–1988)కు అత్యున్నత పురస్కారం దక్కిందని, ఆయన చేసిన కృషికి గుర్తుగా ఆయన మరణానంతరం ఆయన శత జయంతి సందర్భంగా భారత ప్రభుత్వం భారతరత్న ప్రకటించి గౌరవించిందని, అలాంటి మహోనీయుని స్ఫూర్తితో న్యాయవాదులు సమన్యాయం కోసం పోరాటం చేయాలని వరంగల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మైదం జయపాల్ పిలుపునిచ్చారు. వరంగల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన భారత రత్న, జననాయక్ కర్పూరి ఠాకూర్ 38వ వర్ధంతి ఆయన పాల్గొని మాట్లాడారు. 1970వ దశకంలో రెండు సార్లు బీహార్ ముఖ్యమంత్రిగా పనిచేసిన కర్పూరీ ఠాకూర్ జన నాయక్ (జననేత) గా గుర్తింపుపొందారని, రాజకీయంగా అగ్రకులాలు ఆధిపత్యం వహించే బీహార్‌లో ఒబిసి ల రాజకీయాలకు ఆయన నాంది పలికారని, మొదటిసారి రెండుసార్లు ముఖ్యమంత్రి అయిన కాంగ్రెస్ యేతర సోషలిస్టు నాయకుడు కూడా కర్పూరి ఠాకూరే కావడం విశేషమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు తీగల జీవన్ గౌడ్ మాట్లాడుతూ భారత అత్యున్నత పురస్కారమైన భారతరత్న గ్రహీతల్లో ఠాకూర్ 49వ వ్యక్తి అని, అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతి, సమానత్వం, సాధికారత కోసం కర్పూరి ఠాకూర్ తిరుగులేని నిబద్ధతతో పనిచేశారని, ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని, విజనరీ నాయకత్వం ద్వారా దేశ సామాజిక–రాజకీయ నిర్మాణంలో ఆయన చెరగని ముద్ర వేశారని ప్రధాని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ మంగళి కులంలో జన్మించిన కర్పూరి ఠాకూర్ యుక్త వయసులో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని 26 నెలల పాటు జైలు జీవితం గడిపారని, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1952లో తొలిసారిగా బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారని తెలిపారు. ఠాకూర్ తన రాజకీయ జీవితంలో అనేక మైలురాళ్లను అధిగమించారని ముఖ్యమంత్రి అవకముందు ఉప ముఖ్యమంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా పనిచేశారని తెలిపారు. 1970లో రాష్ట్ర మొదటి కాంగ్రెసేతర ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించారు. అంతేకాదు అప్పటికే రాష్ట్రాన్ని నాశనం చేస్తున్న మద్యపానాన్ని నిషేధిస్తూ బీహార్‌లో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని విధించారని, విద్యకు ప్రధాన్యత ఇస్తూ పాఠశాలలు, కళాశాలలను స్థాపించడంలో ముఖ్యపాత్ర పోషించి బీహార్‌లో అట్టడుగు ప్రజలకు విద్య అందుబాటులోకి వచ్చేలా చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐ ఎల్ పి ఎ వరంగల్ జిల్లా కన్వీనర్ విలాసాగరం సురేందర్ గౌడ్ మాట్లాడుతూ బిహార్‌లో రిజర్వేషన్ల అమలుకు ఆద్యుడని స్వాతంత్ర్యం అనంతరం భారతదేశంలో సోషలిస్టు ఉద్యమానికి నాయకత్వం వహించిన రామ్ మనోహర్ లోహియా వంటి వ్యక్తుల నుంచి కర్పూరి ఠాకూర్ స్ఫూర్తి పొందారని, ఈ నేపథ్యంలోనే ఓబీసీలకు రిజర్వేషన్ కోసం 1990 మండల్ కమిషన్‌కు ముందుగానే 1977లో ముంగేరి లాల్ కమిషన్ నివేదిక మేరకు 9178లోనే ముస్లింలలోని బలహీన వర్గాలతో సహా వెనుకబడిన తరగతుల వారి కోసం రిజర్వేషన్లు అమలు చేశారని అన్నారు. కర్పూరీ ఠాకూర్ విధానాలు ఇప్పటికి బీహార్‌లో కనిపిస్తాయని, లాలూ, నితీశ్, పాశ్వాన్‌లకు గురువని అన్నారు. బీహార్‌లో ఓబీసీ రాజకీయాలకు పునాది వేసిన వారిలో కర్పూరి ఠాకూర్ ప్రథములని, గొప్ప రాజనీతిజ్ఞుడిగా గుర్తింపు పొందిన కర్పూరి ఠాకూర్ ఉద్యమ స్ఫూర్తితో సామాజిక న్యాయం కోసం సమరం చేయాల్సిన అవసరముందని అన్నారు. జనాభా దామాషా ప్రకారంగా ఒబిసి లకు రాజకీయ రిజర్వేషన్ల కోసం ఉద్యమించాల్సిన అవసరముందని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ బార్ అసోసియేషన్ కోశాధికారి సిరిమల్ల అరుణ, ఐ ఎల్ పి ఎ నాయకులు దయాల సుధాకర్, బండి మొగిలి, జన్ను పద్మ, గురిమిల్ల రాజు, జన్ను ప్రభాకర్, సురేందర్, ఎగ్గడి సుందర్ రామ్, ఎలమాద్రి రవి, న్యాయవాదులు డాక్టర్ జిలకర శ్రీనివాస్, గంధం శివ, కోటేశ్వరరావు, వేముల రమేష్, బండారి విక్రమ్ పాల్గొన్నారు

# శ్రీ వాసవి అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ



**గంగాధర ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్ చౌరస్తాలో ఈరోజు శ్రీ వాసవి అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఐదవ అమావాస్య సందర్భముగా మహా అన్న ప్రసాద వితరణ సుమారు 400 మందికి అన్న ప్రసాద వితరణ చేయడం జరిగింది. ఇ కార్యక్రమానికి శ్రీ వాసవి అన్నపూర్ణ సేవాద సమితి సభ్యులందరూ పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.

# సత్తుపల్లి డిపో నీలాద్రి ఆదాయం రూ 844428

## - డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ



**సత్తుపల్లి, ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మహాశివరాత్రి సందర్భంగా సత్తుపల్లి డిపో నుండి నీలాద్రి 26 బస్సులు నడపగా 844428 రూపాయలు ఆదాయం వచ్చినట్లు మంగళవారం సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ తెలిపారు. మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా 15వ తేదీ ఉదయం నాలుగు గంటల నుండి 16వ తేదీ ఉదయం ఆరు గంటల వరకు బస్సులు ప్రయాణికుల సౌకర్యార్థం నడిపినట్లు ఆయన వివరించారు. తద్వారా ఈపీకే 92.66, ఓఆర్ 142 వచ్చినట్లు ఆయన తెలిపారు. 9113 కిలోమీటర్లు ఆపరేట్ చేసినట్లు ఆయన వివరించారు. గత సంవత్సరం తో పోలిస్తే 26 వేల రూపాయలు అదనంగా ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. మొత్తం ప్రయాణికులు 23,422 మంది ప్రయాణించగా వారిలో 14127 మంది మహాలక్ష్మి స్కీం ద్వారా ప్రయాణించిన మహిళలు ఉన్నట్లు ఆయన తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే 500 మంది ప్రయాణికులు అదనంగా తమ బస్సులలో ప్రయాణించినట్లు డిపో మేనేజర్ తెలిపారు. ఆర్టీసీ బస్సులను ఆదరించిన ప్రయాణికులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి ప్రవీణ్ కుమార్, మెకానికల్ ఇంజనీర్ ఎస్ సాహితి పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి 'యలమందల' ఆపన్నహస్తం

## ● నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, 25కిలోల బియ్యం, 2వేలు నగదు ● పేదలకు యలమందల జగదీష్ సేవలు ఆదర్శప్రాయం



**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆపదలో ఉన్న ఓ పేద కుటుంబానికి నెలకు సరిపడా నిత్యవసర సరుకులు, బియ్యం, ఆర్థిక సాయం అందజేసి మానమత్వాన్ని చాటుకున్న మంచి మనసున్న నాయకులు, నాయి బ్రాహ్మణ నగర అధ్యక్షులు, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్. ఖమ్మం అర్బన్ మండలం, కైకొండాయిగూడెం, 1వ డివిజన్ కు చెందిన ఆంగోత్ భద్రు అంధుడు. అతనికి ప్రమాదం జరిగి కాలు ఇంపెక్షన్ తో నడవలేని పరిస్థితిలో కుటుంబ భారంతో ఉన్నాడు. అతనికి ఇద్దరు ఆడపిల్లలు. కుటుంబం గడవడమే కష్టంగా ఉంది. భద్రు కుటుంబ పరిస్థితిని గమనించిన నాయి బ్రాహ్మణ నగర అధ్యక్షులు యలమందల జగదీష్ మానవత్వంతో మంగళవారం ఆ కుటుంబానికి తక్షణ సహాయంగా నెలకు సరిపోయే నిత్యావసర వస్తువులు, 25కిలోల బియ్యంతో పాటు 2వేల రూపాయల నగదు ఇవ్వడం జరిగింది. పేద కుటుంబాన్ని ఆదుకున్న విషయం గ్రామమంతా చర్చిని అంశంగా మారింది. మానవత్వం ఇంకా బ్రతికే ఉంది. మంచి మనసులు మన మధ్యనే ఉన్నారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. కనీసం బంధువులు కూడా ఇటువంటి సహాయాన్ని అందించరని బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. పేద కుటుంబానికి సాయం అందించిన యలమందల జగదీష్ కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ నగర అధ్యక్షులు, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్, లాంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు భద్రు నాయక్, నూర్ భాషా జిల్లా ప్రధాన కార్యదర్శి మీరా, నూర్ భాషా అధికార ప్రతినిధి అన్వర్ పాషా, ఆంగోతు కిషోర్, తేజావత్ రాంకోటి, వీరస్వామి, పుల్లయ్య, శ్రీనివాస్, ఉబ్బనపల్లి రాము, తేజావత్ రమేష్, మహిళలు, గ్రామస్తులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు








## ● సండ్ర నాయకత్వంలో కేక్ కట్ చేసి, స్వీట్స్ పంచి, రోగులకు పండ్లు పంపిణీ

**కల్లూరు, ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు పట్టణ కేంద్రంలోని మెయిన్ సెంటర్ లో తెలంగాణ రాష్ట్ర ఉద్యమ యోధుడు, రాష్ట్ర సాధకులు, తొలి ముఖ్యమంత్రి వర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలు మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య నాయకత్వంలో బిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి, ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేసినారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల ముఖ్య నాయకులు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కెసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు , జరిగిన అభివృద్ధి దేశానికే దిక్సూచిగా నిలిచాయాని కొనియాడారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు, గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో ఉన్న విధానాలకు ప్రజలు వ్యత్యాసం ఇప్పటికే గ్రహించారని, రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వం లో ప్రభుత్వ ఏర్పాటు తథ్యం అని ధీమా వ్యక్తం చేశారు. సత్తుపల్లి నియోజకవర్గంలో మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకట వీరయ్య సారథ్యంలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు రాష్ట్రంలోనే ఒక రోల్ మోడల్ గా నిలిచేయని అన్నారు. నిన్న మొన్న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ సైనికులు శక్తి వంచన లేకుండా కృషి చేశారని అభినందించారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని ఎవ్వరు కృంగిపోవద్దని అన్నారు. రాబోవు అసెంబ్లీ ఎన్నికలనాటికి పార్టీ కేడర్ మరింత శక్తిని కూడగట్టుకుని ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కట్టా అజయ్ కుమార్, లక్కినేని రఘు, పెడకంటి రామకృష్ణ, కాటంనేని వెంకటేశ్వరరావు, కళ్యాణపు ఏడుకొండలు, కొత్తపల్లి వెంకటేశ్వ ర్లు, మేకల కృష్ణ, సయ్యద్ ఇంతియాజ్, దార్ల నరసింహారావు, మహమ్మద్ ఇస్మాయిల్, కొరకొప్పు ప్రసాద్, రావి సూర్యనారాయణ, గంగవరపు వెంకటేశ్వరరావు, చారుగుండ్ల సందీప్, ఖమ్మంపాటి పుల్లారావు, కట్టా ఆర్లప్ప, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



# మంత్రి పొంగులేటి సహకారంతో మున్సిపాలిటీని తీర్చిదిద్దుతాం




## ● చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్

**కల్లూరు, ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్ట రాగమయి దయానంద్, సహాయ సహకారాలతో కల్లూరు మున్సిపాలిటీ నీ తీర్చిదిద్దుతామని మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ అన్నారు. మంగళవారం ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్ రావు నివాస గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లూరు మున్సిపాలిటీ ప్రజలు మంచి మెజార్టీతో గెలిపించారని ప్రజలందరికీ రుణపడి ఉంటామని ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రి పొంగులేటి, తుమ్మల, బట్టి, ఎమ్మెల్యే సహసహకారాలతో కల్లూరు మున్సిపాలిటీ అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. ఎటువంటి పక్షపాతం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి పేదవానికి అందే విధంగా కృషి చేస్తామని అన్నారు. గతంలో మా గ్రామం ప్రత్యేక పంచాయతీగా ఏర్పడినప్పుడు ప్రజలు నన్ను ఆశీర్వదించి సర్పంచిగా గెలిపించారని ఇప్పుడు నూతన మున్సిపాలిటీగా కల్లూరు ఏర్పడిన తర్వాత తొలి చైర్మన్ గా ఎన్నిక చేయబడ్డానని అందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాఘమై కి కృతజ్ఞతలు తెలుపుతూ వారికి రుణపడి ఉంటానని తెలిపారు. రానున్న కాలంలో అందరి సహకారంతో ప్రతి వార్డులో చేయవలసిన పనులు కచ్చితంగా చేయడం జరుగుతుందని అన్నారు. వార్డులలో తిరిగినప్పుడు ప్రజలు అనేకమైన సమస్యలు మా దృష్టి తీసుకువచ్చారని ఆ సమస్యలు అన్నింటికి పరిష్కారం చూపిస్తామని అన్నారు. మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి సహాయ సహకారాలతో కల్లూరు మున్సిపాలిటీని రాష్ట్రంలోనే నెంబర్ వన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దామని అన్నారు. కల్లూరు మున్సిపాలిటీలో ఉన్న 20 మంది వార్డ్ కౌన్సిలర్లు ఐక్యంగా ఉండి పనిచేస్తూ మున్సిపాలిటీకి మంచి పేరు తీసుకురావాలని కోరారు. పార్టీలో ఉన్న పెద్దల సహకారంతో, వారి సూచనలతో, సలహాలను తీసుకుంటూ ముందుకు వెళ్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి మున్సిపాలిటీ ప్రజలకు, నాకు సహకరించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఉస్మాన్, వేణుగోపాలస్వామి దేవాలయం చైర్మన్ దారారంగ, కౌన్సిలర్లు యాస నాగమణి శ్రీకాంత్, గుండ్ల పుల్లారావు, ఖమ్మంపాటి రాధా వీరస్వామి, కిష్టంశెట్టి లక్ష్మీ ఏడుకొండలు, భూక్య రాంభాయ్, జిల్లెల్ల స్వాతి, భానోత్ మారోని, జనార్ధన్, హతీరం, కాటేపల్లి కిరణ్ కుమార్, నోటి కృష్ణారెడ్డి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టానికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి: రాష్ట్ర ప్రధాన కమిషనర్‌కు వినతి



**కరీంనగర్ జిల్లా ఫిబ్రవరి 17(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ: సమాచార హక్కు చట్టం కింద అడిగే ప్రతి ప్రశ్నకు సంబంధిత అధికారులు తప్పనిసరిగా సమాధానాలు ఇవ్వాలని, ప్రభుత్వ అధికారుల్లో జవాబుదారీతనం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ప్రధాన కమిషనర్‌ను ఈరోజు మర్యాదపూర్వకంగా కలిసినట్లు మాసం సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం ప్రజలకు ఇచ్చిన ముఖ్యమైన హక్కు అని, కానీ అనేక సందర్భాల్లో అధికారులు సమయానికి సరైన సమాధానాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అందువల్ల, సమాచార హక్కు చట్టం అమలు సక్రమంగా జరిగేలా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు స్పష్టమైన సూచనలు ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన కమిషనర్‌ను విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కమిషనర్ ఈ విషయాన్ని సానుకూలంగా స్వీకరించి, సంబంధిత అంశంపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## నల్ల పోచమ్మ ఆలయంలో నవగ్రహ హోమం, అన్నదానం

**హైదరాబాద్ ఫిబ్రవరి 17(పిసిడబ్ల్యూ న్యూస్):** అమావాస్య సందర్భంగా కోటి రాణి పార్క్ సమీపంలోని నల్ల పోచమ్మ ఆలయంలో మంగళవారం శాంతి, సమాజ శ్రేయస్సు కోసం దైవిక ఆశీస్సులు కోరుతూ పవిత్రమైన నవగ్రహ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు, ఆలయ కమిటీతో కలిసి, ఆలయంలో ఉన్న భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ప్రభు బిరాదార్, గోవర్ధన్ లాల్, సునీల్, రవి కుమార్, ప్రవీణ్ యాదవ్, రామేశ్వర్ మిశ్రా, వీరేందర్ అవస్థి, నరేష్, ప్రముఖ సభ్యులు భక్తులు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.భక్తులు, సమాజ సభ్యుల చురుకైన భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం భక్తి వాతావరణంలో జరిగింది.



# భారత రత్న, జననాయక్ కర్పూరి ఠాకూర్ 38వ వర్ధంతి కార్యక్రమం

**ఆ మహా నీయుని స్ఫూర్తిలో..**

**బీసీ సమాజిక వర్గం ఐక్యం కావాలి**

**చాపర్తి "కుమార్ గాడ్గే " పిలుపు: ఫిబ్రవరి 17**



**వరంగల్ ప్రతినిధి, ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయం కోసం పోరాడిన బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్ (1924–1988)కు చేసిన కృషికి గుర్తుగా ఆయన మరణాంతరం దేశ అత్యున్నత పురస్కారం భారత ప్రభుత్వం భారతరత్న ప్రకటించింది. ఆయన శత జయంతి వేళ దేశ అత్యున్నత పురస్కారానికి ఆయనను ఎంపిక!చేసారు. 1970వ దశకంలో రెండు సార్లు బీహార్ ముఖ్యమంత్రిగా పనిచేసిన కర్పూరీ ఠాకూర్ జన నాయక్ (జననేత) గా గుర్తింపుపొందారన్నారు. రాజకీయంగా అగ్రకులాలు ఆధిపత్యం వహించే బీహార్‌లో ఒబిసి ల రాజకీయాలకు ఆయన నాంది పలికారని,మొదటిసారి రెండుసార్లు ముఖ్యమంత్రి అయిన కాంగ్రెస్ యేతర సోషలిస్టు నాయకుడు కూడా కర్పూరి ఠాకూరే కావడం విశేషమన్నారు,భారత అత్యున్నత పురస్కారమైన భారతరత్న గ్రహీతల్లో ఠాకూర్ 49వ వ్యక్తి.అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతి, సమానత్వం, సాధికారత కోసం ఆయన చేసిన పోరాటం, జీవితం స్ఫూర్తిదాయకమని, విజనరీ నాయకత్వం ద్వారా దేశ సామాజిక–రాజకీయ నిర్మాణంలో ఆయన చెరగని ముద్ర వేశారన్నారు. స్వాతంత్ర్య పోరాటంకర్పూరి ఠాకూర్ 1924, జనవరి 24న మంగళి కులంలో జన్మించారు. ఆయన తండ్రి సన్నకారు రైతుగా ఉండేవారు. యుక్త వయసులో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. 1942–1945 మధ్య క్విట్ ఇండియా ఉద్యమంలో 26 నెలల పాటు జైలు జీవితం గడిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 1952లో తొలిసారిగా బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తేజ్‌పూర్ నియోజకవర్గం నుంచి సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 1967–68 మధ్య రాష్ట్ర విద్యా శాఖ మంత్రిగా సేవలందించారు. ఠాకూర్ తన రాజకీయ జీవితంలో అనేక మైలురాళ్లను అధిగమించారు. ముఖ్యమంత్రి అవకముందు ఉప ముఖ్యమంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. 1970లో రాష్ట్ర మొదటి కాంగ్రెసేతర ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించారు. అంతేకాదు అప్పటికే రాష్ట్రాన్ని నాశనం చేస్తున్న మద్యపానాన్ని నిషేధిస్తూ బీహార్‌లో సంపూర్ణ మద్యపాన నిషేధం విధించారు. అంతేకాకుండా విద్యకు ప్రధాన్యత ఇస్తూ.. పాఠశాలలు, కళాశాలలను స్థాపించడంలో ముఖ్యపాత్ర పోషించారు. బీహార్‌లో అభివృద్ధి చెందని ప్రాంతాలు, అట్టడుగు ప్రజలకు విద్య అందుబాటులోకి వచ్చేలా చేశారు. బిహార్‌లో రిజర్వేషన్ల అమలుకు ఆద్యుడుస్వాతంత్ర్యం అనంతరం భారతదేశంలో సోషలిస్టు ఉద్యమానికి నాయకత్వం వహించిన రామ్ మనోహర్ లోహియా వంటి వ్యక్తుల నుంచి కర్పూరి ఠాకూర్ స్ఫూర్తి పొందారు. వెనుకబడిన తరగతుల (ఓబీసీ) అభ్యున్నతిపై ఆయన తీవ్రంగా ఆలోచించేవారు. ఈ నేపథ్యంలోనే ఓబీసీలకు రిజర్వేషన్ కోసం పోరాడారు. 1990 మండల్ కమిషన్‌కు ముందుగానే 1977లో ముంగేరి లాల్ కమిషన్ నివేదిక మేరకు 1978 లోనే ముస్లింలలోని బలహీన వర్గాలతో సహా వెనుకబడిన తరగతుల వారి కోసం రిజర్వేషన్లు అమలు చేశారు. ఠాకూర్ బీహార్ విద్యా మంత్రిగా ఉన్నప్పుడు మెట్రిక్యులేషన్ స్థాయిలో ఇంగ్లిష్‌ను తప్పనిసరి సబ్జెక్ట్ నుంచి తొలగించారు. విద్యాపరంగా వెనుకబడినవారిని ప్రోత్సహిస్తూ, ఉన్నత విద్యను అభ్యసించేలా ఆయన కృషి చేశారు. కర్పూరీ ఠాకూర్ విధానాలు ఇప్పటికి బీహార్‌లో కనిపిస్తాయి. వెనుకబడిన తరగతుల సాధికారతకు ఆయన చేసిన పోరాటం నేడు జనతాదళ్ (యునైటెడ్), రాష్ట్రీయ జనతాదళ్ వంటి ప్రాంతీయ పార్టీల ఏర్పాటుపై ప్రభావం చూపింది.లాలూ, నితీశ్, పాశ్వాన్‌లకు గురువుబీహార్‌లో ఓబీసీ రాజకీయాలకు పునాది వేసిన వారిలో కర్పూరి ఠాకూర్ ప్రథములు. జయప్రకాశ్ నారాయణ్ ఇచ్చిన పిలుపుతో ఎంతో మంది ఉద్యమంలోకి రాగా అలా వచ్చిన వారిలో లాలూప్రసాద్ యాదవ్, నితీశ్ కుమార్, రాంవిలాస్ పాశ్వాన్ వంటి నేతలకు ఠాకూర్ రాజకీయ గురువు. గొప్ప రాజనీతిజ్ఞుడిగా గుర్తింపు పొందిన కర్పూరి ఠాకూర్ 1988, ఫిబ్రవరి 17న తుదిశ్వాస విడిచారుఅలాంటి గొప్ప బహుజన నాయకుడి ఉద్యమ స్ఫూర్తితో సామాజిక న్యాయం కోసం సమరం చేయాల్సిన అవసరముంది. జనాభా దామాషా ప్రకారంగా ఒబిసి లకు రాజకీయ రిజర్వేషన్ల కోసం ఉద్యమించాల్సిన అవసరముంది. మహా నాయకుడు కర్పూరి ఠాకూర్ వర్ధంతి కార్యక్రమంలో ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, సాయిని నరేందర్, డాక్టర్ కొలిపాక వెంకటస్వామి,తాడిశెట్టి క్రాంతికుమార్,గొల్లపల్లి వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# ఏఐ నైపుణ్యాలతో యువతకు మంచి భవిష్యత్

- **శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయిగీతిక**
- **సాంకేతిక నైపుణ్యాల పెంపుపై స్కిల్ బిల్డ్ ఏఐ వర్క్‌షాప్**

**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఏఐ నైపుణ్యాలతో యువతకు మంచి భవిష్యత్ అని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయిగీతిక అన్నారు. పొన్నేకల్ లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు కళాశాలలో 'స్కిల్ బిల్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అంశంపై మంగళవారం ఒకరోజు వర్క్‌షాప్ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయిగీతిక ముఖ్య అతిథిగా హాజరై వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయిగీతిక మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలక పాత్ర పోషిస్తున్నదని, విద్యార్థులు తాజా సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకుని తమ కెరీర్‌ను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఏఐ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో ఉంటాయని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. లక్ష్మి నారాయణ మాట్లాడుతూ, విద్యార్థులు ఇలాంటి వర్క్‌షాప్‌లను సద్వినియోగం చేసుకొని పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. డీన్ డాక్టర్ వి. సుదర్శన్ మాట్లాడుతూ, ఏఐ టెక్నాలజీ ఆరోగ్యం, విద్య, పరిశ్రమ, వ్యవసాయం వంటి అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని, ప్రాక్టికల్ జ్ఞానం చాలా ముఖ్యమని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఐబిఎమ్ హెడ్ రాఘవేందర్ రావు, ఏఐ యొక్క ప్రాథమిక అంశాలు, మెషీన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిశ్రమలో ప్రస్తుతం అవసరమైన నైపుణ్యాలు, ప్రాజెక్టుల ప్రాముఖ్యత, ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అనేక సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల జరిగిన కార్యక్రమంలో టిపిఓ డాక్టర్ రాజేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, డిప్లమా ఇన్చార్జి కృష్ణప్రసాద్, డాక్టర్ జ్యోతి, డాక్టర్ ప్రణతి, డాక్టర్ చార్యులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.





## అన్ని దానాల కంటే అన్న ప్రసాదం గొప్ప: గంధం జోష్ణ

- **అనంత శక్తి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం**
- **అనంత శక్తి సమితి వారి అన్నప్రసాదానికి అపూర్వ స్పందన**







**ఉప్పల్ జనవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** అన్నదానం చేయడం వల్ల వేలాది యజ్ఞాలు చేయడం కంటే ఎక్కువ పుణ్యఫలితం కలుగుతుందని ఇది గత కర్మలను తొలగించి, దైవానుగ్రహాన్ని ఆకర్షిస్తుందని అనంత శక్తి సమితి ప్రధాన కార్యదర్శి కీర్తి సంతోష్ రాజ్ తెలియజేశారు. ఈ మేరకు రామంతపూర్ డివిజన్ ఆర్టిసి కాలనీలో అనంత శక్తి సేవ సమితి ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమానికి రామంతపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్ గంధం జోష్ణ నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంత శక్తి సేవా సమితి వారి ఆధ్వర్యంలో ప్రతి అమావాస్యకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్ని దానాల్లో కంటే అన్నప్రసాదం చాలా గొప్పదని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఎంతో మందికి మనం సేవ చేసిన వాళ్లమవుతామని సమాజంలో డబ్బులు ఉన్నా కూడా పదిమందికి అన్నం పెట్టాలంటే ఎంతో అదృష్టం ఉండాలని అలాంటివారు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించే వారికి సహాయ సహకారాలు అందించాలని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల యువత ను ప్రోత్సహించిన వాళ్ళమవుతామని అన్నారు. ఈ సందర్భంగా అనంత శక్తి సేవా సమితి ప్రధాన కార్యదర్శి కీర్తి సంతోష్ రాజ్ మాట్లాడుతూ అన్నదానం అనేది అన్ని దానాల్లోకెల్లా మొదటిదన్నారు ఇది మహాదానంగా పరిగణించబడుతుందని తెలిపారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు అన్నాద్ భవన్తి భూతాని అని చెప్పినట్లుగా, ఆహారం సమస్త సృష్టిని పోషిస్తుందని గుర్తుచేశారు. ప్రతీ అమావాస్యకు అనంత శక్తి సమితి వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన ప్రసాద కార్యక్రమానికి అపూర్వస్పందన వస్తుందని తెలియజేస్తూనే, ప్రజలు భారీ సంఖ్యలో విచ్చేసి ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అనంత శక్తి సమితి అధ్యక్షులు కొండ్రాన్ పల్లి గిరిబాబు, కమిటీ సభ్యులు డాన్ బిక్షపతి, వరకవి నాగరాజు, ప్రకాష్, రవి శంకర్ గౌడ్, సుందర్ కల్లూరి, రామంతపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు సూరం శంకర్, దయాకర్ రెడ్డి,చాంద్ పాషా, మనీష్ పాల్గొన్నారు.

## టీజీఎన్పీడీసీఎల్ ఆపరేషన్ డైరెక్టర్ శ్రీ టి.మధుసూదన్ ములుగు సర్కిల్ సమీక్షా



**ములుగు జిల్లా ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లాలో రానున్న వేసవిలో అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించడానికి కృషి చేయాలని కార్యాచరణ ప్రణాళిక మేరకు సకాలంలో పనులు పూర్తి చేయించాలన్నారు. అలాగే రంజాన్ మాసాన్ని దృష్టిలో ఉంచుకొని ములుగు జిల్లాలోని మసీదులు మరియు దర్గాలకు నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగించేందుకు ఆదేశాలు జారీ చేశారు 33కెవి ఇంటర్ లింకింగ్ పనులు మార్చిలోగా పూర్తి చేయాలన్నారు రానున్న వేసవి కాలంలో సరఫరాకు అనుగుణంగా ట్రాన్స్ఫార్మర్ లోడ్ పెంచడం మరియు అదనపు ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు చేయాలన్నారు నిర్మాణంలో ఉన్న ఉప కేంద్రాల పనుల పురోగతి పై చర్చించారు ట్రాన్స్ఫార్మర్లకు ఏబి స్విచులు ఏర్పాటు చేయాలన్నారు రైతులకు విద్యుత్ కనెక్షన్లు సకాలంలో ఏర్పాటు చేయాలని ఏఈలకు ఆదేశాలు జారీ చేశారు ఈ సమావేశంలో ఎస్ ఈ(ఆపరేషన్) ములుగు శ్రీ ఆనందం డీఈ (ఆపరేషన్) ములుగు కన్నరాజు డీఈ ఆపరేషన్ ఏటూరునాగారం జె పురుషోత్తం డీఈ కన్స్ట్రక్షన్ & ఎం ఆర్ టి శ్రీ సదానందం మరియు ఎస్ఏఓ ములుగు ఏడీఈలు మరియు ఏఈలు సబ్ ఇంజినీర్లు పాల్గొన్నారు


## రామకృష్ణ మాధురి దంపతుల వివాహ మహోత్సవ వేడుకలు





**కల్లూరు, ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ) :** పట్టణంలో గల న్యూ ప్రతాప్ ల్యాబ్ అధినేత మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ పెడకంటి రామకృష్ణ మాధురి దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలను తన స్నేహితులు బంధు మిత్రుల మధ్య తన నివాస గృహంలో అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భారీ కేకును కట్ చేసి స్వీట్స్ మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం పెడకంటి రామకృష్ణ మాట్లాడుతూ నా వివాహ వార్షికోత్సవ వేడుకలు ఇంత అంగరంగ వైభవంగా జరుపుకున్న నా స్నేహితులకు నా బంధు మిత్రులకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటేపల్లి రజనీకాంత్, రాచమల్ల నాగేశ్వరరావు, పోట్రు కిరణ్ కుమార్, ప్రముఖ ప్రతాప్ మీసేవ అధినేత లక్ష్మారెడ్డి, కొటికలపూడి కళ్యాణ్ కిషోర్, టెక్నో అధినేత నాగిరెడ్డి, మోర్తాల పిచ్చిరెడ్డి, గుర్రపు శ్రీను, చారుగుండ్ల కిరణ్, సందీప్, పెడకంటి అభిమానులు పాల్గొన్నారు.

## మల్లంపల్లి మాజీ సర్పంచ్ గోల్కొండ రవి రాజీనామా ఫిషర్మెన్ కాంగ్రెస్‌కు గుడ్‌బై



TELANGANA PRADESH FISHERMEN CONGRESS
GANDHI BHAVAN, HYDERABAD - 500001.
METTU SAI KUMAR M.Com., LLB
CHAIRMAN

June 21, 2021

Dear Shri G. Ravi,

We are happy to inform you that you are hereby appointed as Secretary in Fishermen Congress of Telangana Pradesh Congress Committee with immediate effect.

We wish to request you to relentlessly work hard to strengthen the Congress party and strive to strengthen the leadership of Honorable Congress President Smt. Sonia Gandhi ji, Shri N. Prathapan ji, Chairman, AICC Fishermen Congress & Shri N. Uttam Kumar Reddy, President, TPCC.

With best wishes,

Yours sincerely
Mettu Sai Kumar

Shri G. Ravi
9989293064

**మల్లంపల్లి మండల ప్రతినిధి ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్ ):** మల్లంపల్లి మాజీ సర్పంచ్ గోల్కొండ రవి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పరిధిలోని ఫిషర్మెన్ కాంగ్రెస్ సెక్రటరీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.గతంలో దివంగత కాంగ్రెస్ నాయకుడు నల్లెల్ల కుమారస్వామి చొరవతో ఫిషర్మెన్ స్టేట్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన, సుదీర్ఘ కాలంగా సీతక్క అనుచరుడిగా పార్టీ బలోపేతానికి కృషి చేసిన సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందారు.ప్రస్తుతం అనేక కారణాల రీత్యా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు గోల్కొండ రవి వెల్లడించారు. ఆయన నిర్ణయం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ కార్యకర్తల్లో కూడా ఈ రాజీనామాపై ఆసక్తికర చర్చ జరుగుతోంది.మల్లంపల్లి ప్రాంతానికి చెందిన ఆయన భవిష్యత్ రాజకీయ దిశపై స్పష్టత ఇవ్వకపోవడంతో, తదుపరి అడుగులపై ఉత్కంఠ నెలకొంది. ములుగు జిల్లా రాజకీయాల్లో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.



# తెలంగాణను సాధించిన ఉద్యమ నేత కెసిఆర్: బోసాని పవన్ కుమార్

### ఘనంగా మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలు



**ఉప్పల్ ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి రాష్ట్ర అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం యువ నాయకులు బోసాని పవన్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించడానికి ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి తొలి ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవలు అందించిన కల్వకుంట్ల చంద్రశేఖర రావు పుట్టినరోజు వేడుకలను ఉప్పల్ నియోజకవర్గ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు రాజేంద్ర నగర్ చౌరస్తాలో నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వాటర్ బాటిలను పంపిణీ చేశారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేసీఆర్ చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి,సర్వ బాబు యాదవ్,ఎమ్.డి. ముస్తాక్,దయాకర్ రెడ్డి,కిట్టు,టోనీ, చెగూరి శ్రీను, సీమ అశోక్,వెంకటేష్, ఆకాశ్,సునీల్, రఘు,మహేంద్ర యాదవ్ స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేసీఆర్ కి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

# నాయిబ్రాహ్మణుల సమస్యల పరిష్కారం కోసం సంఘటితం కావలసిన సమయం ఆసన్నమైనది



**ములుగు జిల్లా ఫిబ్రవరి 17 2026(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా కేంద్రంలో మంగళవారం నాయిబ్రాహ్మణ సంఘం ములుగు జిల్లా విస్తృత స్తాయి సమావేశము జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవణములో సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న జిల్ల గౌరవ అధ్యక్షులు జంపాల రవీందర్ మాట్లాడుతూ ఐకమత్యం తో ముందుకు వెలితే సమస్యల పరిష్కారం సులువుగా మారుతుంది అన్నారు ఆధునిక పోకడలతోని కార్పొరేట్ యాజమాన్యాలు మరియు ఇతర కులాల ద్వారా పట్టణాలలో దేవాలయాలు జాతరలలో వృత్తి పైన దాడి జరుగుతుంది అన్నారు కనుక అందరూ అప్రమత్తతతో అయిఖ్యం కావలసిన అవసరం అత్యంత ముఖ్యం అన్నారు కనీసం కమ్యూనిటీ హాల్స్ కూడా సాదించుకోలేక పోయామన్నారు అనేకమంది నిరుపేదలకు నివాసగ్రుహాలు ప్రభుత్వం ద్వారా సాదించుకోవలసిన అవసరం ఉంది అన్నారు పేరుకే ఫెడరేషన్ ఉంది కానీ ఒక్క రూపాయి కూడా అందులో ఉండదు కనుక దాని ద్వారా మోడరన్ సెలూన్స్ బ్యూటీపార్లర్లు నిర్మాణాలకు పెద్ద మొత్తాలు సబ్సిడీఋణాలు అందించాలని డిమాండ్ చేసారు అందుకోసం ములుగు జిల్లాలోని అన్ని మండలాలలో మరియు గ్రామ పట్టణ కమిటీలు ఏర్పాటు చేయాలని అనంతరం జిల్లా కమిటీని కూడా ఏర్పాటు చేసుకోవాలని అందుకు సంఘం ప్రతినిధులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు అనంతరం సర్పంచ్ గా ఎన్నికైన జంపాల ప్రభాకర్ వార్డ్ మెంబర్లు గా ఎన్నికైన జంపాల శేఖర్ జంపాల అనిల్ గారలను ఘనంగా సన్మానించుకోవడం జరిగినది ఈ సమావేశంలో పాల్గొన్నవారు సంఘం జిల్లా అధ్యక్షులు జంపాల సత్యనారాయణ ప్రధాన కార్యదర్శి మల్యాల రాంచందర్ గౌరవ సలహదారు మధ్దూరు రాములు మిద్దెమీది సహదేవ్ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుకొండ శరభంధం ముత్యాల రాజు ములుగు పట్టణ కమిటీ అధ్యక్షులు మంధల సంపత్ వేల్పుకొండ సతీష్ ములుగు వెంకటాపూర్ గోవిందరావుపేట తాడ్వాయి ఏటూరునాగారం మంగపేట మండల నాయకులు ఓదెల శ్రీనివాస్ శ్రీనివాస్ శ్రీనివాస్ సంపత్ కుమార్ ప్రవీణ్ శేఖర్ వేల్పుగొండ ప్రకాష్ చిక్కుళ్ళ వెంకటేష్ సంతోష్ మధ్దూరు రాజు శైలజ మురహరి రాము ముత్యాల ప్రకష్ ముఖేష్ రమేష్లు పాల్గొన్నారు

# ఘనంగా కెసిఆర్ జన్మదిన వేడుకలు

**• ఉమ్మడి వరంగల్ జిల్లా బిఆర్ఎస్ లీగల్ సెల్ విభాగం**





**తెలంగాణ ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ ఉమ్మడి జిల్లా బిఆర్ఎస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ అధినేత, తెలంగాణ జాతిపిత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని, మంగళవారం బిఆర్ఎస్ లీగల్ సెల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది గుర్రాల వినోద్ కుమార్ నేతృత్వం లో హనుమకొండ లోని బిఆర్ఎస్ లీగల్ సెల్ కార్యాలయంలో.న్యాయవాదులతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్ లు పంపిణి చేసి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కెసిఆర్ లాంగ్ లివ్ కెసిఆర్ అంటూ నినాదాలు చేస్తూ జనార్దన్ గౌడ్ గణేష్ రంజిత్ పత్రిక ముఖంగా గత అనుభవాలను నెమరు వేసుకున్నారు. కెసిఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమం లో బిఆర్ఎస్ లీగల్ సెల్ జనరల్ సెక్రటరీ గోకికర్ శివరాజ్ సీనియర్ న్యాయవాదులు, సహోదర్ రెడ్డి,తాళ్లపల్లి జనార్దన్ గౌడ్,వద్ది రాజ్ గణేష్,శ్యామ్ సుందర్ రావు, సోమేశ్వర్ రావు, చింతం సదానందం, ములుగూరి రంజిత్, నబి, వసంత్, వెంకటేశ్వర్ రావు బి, సిద్ధం యుగేందర్, వెంకట రమణ,శ్రీరాం కిరణ్, వెనుపటేల్, నాయిని రవి,శ్రీ రామ్,కొండయ్య, ఎలామాద్రి రవి,అనిల్ నాయక్, రమేష్, నాగరాజు తది తర న్యాయవాదులు పాల్గొన్నారు.

# మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

### రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి






**హన్మకొండ,ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు/కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ., ఏ.ఈ.ఆర్.ఓ లతో ప్రత్యేక సమగ్ర సవరణకు ముందుగా చేపట్టిన మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులకు సహాయ సహకారాలు అందిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి తిరిగి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఇందుకు గాను గ్రామ పాలన అధికారులు, ఇతర అధికారులను బూత్ స్థాయి అధికారులకు మ్యాపింగ్ లో సహాయకులుగా నియమించి మ్యాపింగ్ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి వారి పార్టీ నుంచి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో తిరుగుతూ మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని, బూత్ స్థాయి అధికారుల పర్యవేక్షకులు, ఏ ఈ ఆర్ ఓ లు వారికి మ్యాపింగ్ చేయడంలో సహాయ సహకారాలు అందించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జరిగేలా పకడ్బందీగా ప్రక్రియ చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలని, పెండింగ్ లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, హనుమకొండ పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కె.నారాయణ, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, పరకాల, హనుమకొండ, కాజీపేట తహసీల్దార్లు విజయలక్ష్మి, రవీందర్ రెడ్డి, రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు

# తెలంగాణ అస్థిత్వ శిఖరం " కేసిఆర్ "

### బీఆర్ఎస్వీ కేయు ఆధ్వర్యంలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



**హన్మకొండ,ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర సాధకుడు, జాతిపిత, తొలి ముఖ్య మంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను కెయు బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. బీఆర్ఎస్వీ కెయు ఇంచార్జి జెట్టి రాజేందర్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బిఆర్ఎస్వీ ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్ చంద్ర, యూనివర్సిటీ బిఆర్ఎస్వీ అధ్యక్షులు బైరపాక ప్రశాంత్ లు మాట్లాడుతూ.. "రాష్ట్రం కోసం నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షను, 62 ఏళ్ల కలను సాకారం చేయడమే కాకుండా, తన ప్రాణాలను పణంగా పెట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి తెలంగాణ జాతిపితగా ప్రజల హృదయాల్లో కేసీఆర్ చెరగని స్థానాన్ని సంపాదించుకున్నారు. 'నా రాష్ట్రం నాకు ముఖ్యం, నా ప్రాణం తెలంగాణ, తెలంగాణకు నీళ్లు రావాలి, నా ప్రజలు బాగుపడాలి.. దాన్ని నేను కళ్లారా చూసి సంతోషపడాలి' అన్నదే ఆయన లక్ష్యం. అదే స్ఫూర్తి, పట్టుదలతో ప్రజల ఆశీర్వాదంతో రెండు సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చారు. తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తూ మౌలిక సదుపాయాల కల్పన, అద్భుతమైన సంక్షేమ పథకాలను ప్రజలకు అందించారు" అని కొనియాడారు. "రాష్ట్రం ఏర్పడిన పదేళ్లలో తెలంగాణ అద్భుతమైన ప్రగతిని సాధించింది. నిజం నిప్పులాంటిది, అబద్ధాలతో కప్పిపుచ్చాలని చూస్తే దాగదు. కేసీఆర్ సాధించిన ప్రగతి కేంద్రం ప్రకటించిన ఆర్థిక సర్వే నివేదికలతోనే స్పష్టమైంది. ఇప్పటికే కాగ్ రిపోర్ట్, నీతి ఆయోగ్‌తో పాటు అంతర్జాతీయ సంస్థలు కూడా తెలంగాణ అభివృద్ధిని గుర్తించాయి. కేసీఆర్ పాలనపై దుష్ప్రచారం చేసే రాజకీయ నేతలు ఇప్పటికైనా తమ వైఖరి మార్చుకోవాలి" అని వారు పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల కలలు సాకారం కావాలంటే రాబోయే రోజుల్లో కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని వారు ఆకాంక్షించారు. భగవంతుడి ఆశీర్వాదంతో ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ బీఆర్ఎస్వీ నాయకులు కందికొండ తిరుపతి, గొల్లపల్లి వీరు, పిన్నింటి విజయ్ కుమార్, పస్తం అనిల్, మహేష్, ఇస్మాయిల్, కార్తీక్, నల్లతీగల శ్రీకాంత్, సాయికుమార్, శివ, సాయి, వేణు, అఖిల్, అజయ్, పవన్ ఇతర బీఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.


# ఘనంగా మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, ఫిబ్రవరి 17(పిసిడబ్ల్యూ న్యూస్):** మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం బోడుప్పల్‌లోని ప్రతాప్ సింగారంలోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మహిళా కాంగ్రెస్ నాయకురాలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. అనంతరం మహిళా నాయకురాళ్లు పూలమాలలు వేసి శాలువాతో సన్మానించారు. మహిళా కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు సునీత మాట్లాడుతూ సుధీర్ రెడ్డి నాయకత్వం ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలిచిందని పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షురాలు దుర్గా, మేడ్చల్ ఏ బ్లాక్ అధ్యక్షురాలు తాటికాయల కోమలత, దమ్మాయిగూడ డివిజన్ అధ్యక్షురాలు జూపల్లి శోభారాణి, బోడుప్పల్ డివిజన్ అధ్యక్షురాలు సమతా యాదవ్, ఫీర్జాదిగూడ కార్పొరేషన్ రెండవ వార్డు అధ్యక్షురాలు తండా పరమేశ్వరి, గుండ్ల పోచంపల్లి మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్ శిల్ప తదితరులు ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో సుధీర్ రెడ్డి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. సుధీర్ రెడ్డి సంపూర్ణ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

# ఈనెల 18 నుండి 27 వరకు స్టార్ గేజింగ్ కార్యక్రమాలు

- రుద్రమ వి.01మోడల్ రాకెట్ ప్రయోగం
- నాలుగు ప్రొఫెషనల్ ఖగోళ టెలిస్కోపులు ఏర్పాటు
- కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి







**హన్మకొండ,ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎక్స్‌ప్లోరా – స్పేస్ ఎడ్యుకేషన్ ఇనిషియేటివ్ డ్రైవ్ లో భాగంగా, ఫిబ్రవరి 18 నుండి 27 వరకు వరంగల్ భద్రకాళి బండ్ వద్ద ప్రజల కోసం స్టార్ గేజింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ లోని కాళోజి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకట్రాం రెడ్డి మాట్లాడుతూ కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో, ఏ టి డి ఆర్ ఎల్ స్పేస్ రీసెర్చ్ ల్యాబ్, రిజిస్టర్డ్ ఇస్రో స్పేస్ ట్యూటర్ శశాంక్ భూపతి, నిట్ వరంగల్ అకడమిక్ భాగస్వామ్యంతో, వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రోత్సాహంతో నిర్వహించ బడుతోందని తెలిపారు.ఈ కార్యక్రమం కోసం నాలుగు ప్రొఫెషనల్ ఖగోళ టెలిస్కోపులు ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడి, చంద్రుడు, గ్రహాలు మరియు లోతైన ఆకాశ వస్తువుల పరిశీలనకు ప్రజలు మరియు విద్యార్థులకు అవకాశం కల్పించబడింది. ఖగోళ పరిశీలనతో పాటు, వరంగల్లో ఐ ఎస్ ఆర్ ఓ మిషన్ గ్యాలరీ థీమ్ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా రుద్రమ వి.01 మోడల్ రాకెట్ ప్రయోగం నిర్వహించబడుతోంది అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పేయి, నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుద్ధి, ఇస్రో నిట్ నోడల్ ఆఫీసర్ ఆంజనేయులు, కుడా సీపీవో అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



**నడికూడ, ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నడికూడ మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నందికొండ గణపతి రెడ్డి, హనుమకొండ జిల్లా విద్యార్థి విభాగ కోఆర్డినేటర్ పోచంపల్లి రఘుపతి మాట్లాడుతూ, "తెలంగాణ వస్తుందో రాదో అన్న అనుమానాల మధ్య అసాధ్యాన్ని సుసాధ్యం చేసి ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన అపర భగీరథుడు కేసీఆర్" అని కొనియాడారు. కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టులతో బీడు భూములను పచ్చని పొలాలుగా మార్చారని, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించారని తెలిపారు. రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు దేశానికే దిక్సూచిగా నిలిచాయని పేర్కొన్నారు. రాజకీయ నాయకుడిగానే కాకుండా కవిగా, సాహితీవేత్తగా తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడని ప్రశంసించారు.కేసీఆర్ గారు మరిన్ని వసంతాలు పూర్తి చేసుకుని నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, వారి నాయకత్వంలో తెలంగాణ ప్రజలు మరింత సుఖసంతోషాలతో ఉండాలని పార్టీ ప్రతినిధులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ నందికొండ జయపాల్ రెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు తిప్పర్తి సాంబశివరెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి లింగాల తిరుపతి, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పోచంపల్లి రఘుపతి, మాజీ సర్పంచ్ గూడెం కృష్ణమూర్తి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రశాంత్ రెడ్డి, రావుల కిషన్, ఉపసర్పంచ్ రాసమల్ల మల్లికార్జున్ పాల్గొన్నారు.

# ఘనంగా కెసిఆర్ జన్మదిన వేడుకలు

• మండల అధ్యక్షులు అల్లం రవీందర్





**చిట్యాల ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో బి.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గౌరవ మాజీ ముఖ్యమంత్రివర్యులు కేసిఆర్ గారి 72వ జన్మదిన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి, కస్తూర్బా పాఠశాలలో పిల్లలకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు అల్లం రవీందర్, మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్ యాదవ్లి మాజీ పిఏసిఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్ రెడ్డి, యూత్ మండల్ ప్రెసిడెంట్ థౌటం నవీన్,వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్ నాయకులు, మడికొండ రవీందర్రావు, ఏరుకొండ రాజేందర్, కైలాపూర్ సర్పంచ్ కొడారి ఓదెలు, అర్ సీ పూర్ సర్పంచ్ గాజె అశోక్, టౌన్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీధర్, నాయకులు పాండ్రాల వీరస్వామి, మురహరి తిరుపతి, జెట్టి కుమార్, కొడారి రవి, శ్రీను, కిరణ్ రాజేందర్, సాదా మల్లయ్య, నోముల నాగరాజ్, రాజిరెడ్డి, శ్రీనివాస్, రవి,వీరారెడ్డి, జీబు, శ్రీను, రాజు, క్యాతం రమేష్, పార్లపెల్లి భద్రయ్య, చందు, దుర్గాప్రసాద్, నేపాలి రాజేష్, పుట్టపాక నరసింహ, గుర్రం సుశ్రుతు పాల్గొన్నారు.

# శానిటేషన్ నిర్వహణలో జవాన్ల పాత్ర కీలకం




**- నగర మేయర్ గుండు సుధారాణి**

**- సమర్థవంత శానిటేషన్ నిర్వహణకు కమిషనర్ తో కలిసి సూచనలు చేసిన మేయర్**

**- జవాన్‌లకు మానిటరింగ్ రిజిస్టర్ ల అందజేత**

**హన్మకొండ,ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నగర శానిటేషన్ నిర్వహణ లో జవాన్ల పాత్ర అత్యంత కీలకమని నగర మేయర్ గుండు సుధారాణి పేర్కొన్నారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్‌లో హన్మకొండ పరిధికి చెందిన శానిటేషన్ జవాన్లతో నిర్వహించిన సమావేశంలో మేయర్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి పాల్గొని శానిటేషన్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో శుభ్రతను కాపాడాలంటే జవాన్లు చిత్త శుద్ధితో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత జవాన్లదేనని తెలిపారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేయించుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని, మల వ్యర్థాలు ఎఫ్ఎస్టీపీకి చేరేలా చూడాలని సూచించారు. ప్రతి డివిజన్‌కు ముగ్గురు వాలంటీర్లను నియమించి తడి, పొడి చెత్త వేరు చేసే విధానాన్ని బలోపేతం చేస్తున్నామని, జవాన్లు వారికి పూర్తి సహకారం అందించాలని మేయర్ కోరారు. ఆస్కీ సహకారంతో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్‌పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక వాలంటీర్లను నియమించామని తెలిపారు. రోజువారీ డ్రైన్ల శుభ్రపరిచే పనులు, డోర్ టు డోర్ చెత్త సేకరణ, ట్రాక్టర్ల ద్వారా వ్యర్థాల రవాణా, ట్రేడ్ అండ్ యూజర్ చార్జీల వసూళ్లు, మధ్యాహ్న శానిటేషన్ గ్యాంగ్ వర్క్‌లను క్రమబద్ధం గా నిర్వహించాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్ లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు ఐఈసీ కార్యకలాపాలపై దృష్టి సారించాలని తెలిపారు. కమిషనర్ చాహాత్ బాజ్ పాయి మాట్లాడుతూ శానిటేషన్ సంబంధిత ఫిర్యాదుల పరిష్కారంలో చురుకుగా వ్యవహరించాలని, పండుగల సందర్భంగా ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంలో జవాన్లు కీలక భూమిక పోషించాలని అన్నారు.

బహిరంగంగా మల వ్యర్థాలు డంప్ చేస్తే జరిమానాతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేసే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశం ముగింపులో రోజువారీ సమగ్ర శానిటేషన్ నిర్వహణ నమోదు కోసం రూపొందించిన "జవాన్ మానిటరింగ్ రిజిస్టర్"ను మేయర్ ,కమిషనర్ ఆవిష్కరించి జవాన్లకు అందజేశారు. ఈ కార్యక్రమ లో సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, ఎం హెచ్ ఓ డా.రాజేష్, సానిటరీ సూపర్ వైజర్ లు గోల్కొండ శ్రీనివాస్, నరేందర్, భాస్కర్ లతో పాటు టి ఎం సి రమేష్, ఆస్కీ ప్రతినిధి రాజ్ మోహన్, సానిటరీ ఇన్స్పెక్టర్ లు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాధించిన చరిత్ర కేసీఆర్‌ది

**• తెలంగాణలో కెసిఆర్ పోరాట చరిత్ర చిరస్థాయిగా నిలిచి ఉంటుంది**

**• ఎమ్మెల్సీ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి • 'జీవన సంధ్య వృద్ధాశ్రమం'లో బీఆర్ఎస్ యువజన విభాగం ఖమ్మం అధ్యక్షుడు దేవభక్తుని కిషోర్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా కెసిఆర్ 72వ జన్మదిన వేడుకలు**





**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ సాధించిన చరిత్ర కేసీఆర్ దని, ప్రత్యేక తెలంగాణ సాధనలో కెసిఆర్ పోరాట చరిత్ర చిరస్థాయిగా నిలిచి ఉంటుందని ఎమ్మెల్సీ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి లు అన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, స్వరాష్ట్ర సాధకుడు, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు జన్మదిన వేడుకలను పువ్వాడ అజయ్ కుమార్ నాయకత్వంలో ఖమ్మంలో ఘనంగా నిర్వహించారు. అజయ్ కుమార్ ఆదేశాల ప్రకారం ఖమ్మంలోని 'జీవన సంధ్య వృద్ధాశ్రమం'లో బీఆర్ఎస్ యువజన విభాగం ఖమ్మం అధ్యక్షుడు దేవభక్తుని కిషోర్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం కెసిఆర్ 72వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి హాజరై కేసీఆర్ జన్మదిన కేకును కట్ చేసి ఆశ్రమంలోని వృద్ధులకు, పార్టీ కార్యకర్తలకు పంచారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి ఊపిరిపోసి, కోట్లాది మంది ఆకాంక్షలకు స్వరూపం కల్పించిన మహానాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ప్రజాస్వామ్య పద్ధతుల్లో ముందుకు నడిపి, తెలంగాణను సాధించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. స్వరాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రైతు సంక్షేమమే లక్ష్యంగా రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలను ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారని చెప్పారు. సాగునీటి రంగంలో కాళేశ్వరం వంటి మహత్తర ప్రాజెక్టులతో తెలంగాణను సస్యశ్యామలం చేసిన దూరదృష్టి గల నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధిలో ఆయన చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళీ ప్రసాద్ రావు పువ్వాడ అజయ్ కుమార్ గారి వ్యక్తిగత సహాయకులు చిరుమామిళ్ల రవి కిరణ్, ఆరో డివిజన్ కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, నాలుగో డివిజన్ కార్పొరేటర్ దండ జ్యోతి రెడ్డి,23వ డివిజన్ కార్పొరేటర్ మాగబుల్, బీఆర్ఎస్ యువజన విభాగం ఖమ్మం అధ్యక్షుడు దేవభక్తుని కిషోర్ బాబు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు వాంకుడోత్ సురేష్ నాయక్, రఘునాధపాలెం మండల అధ్యక్షులు అజ్మీర వీరు నాయక్, రఘునాధపాలెం మండల నాయకులు పిన్ని కోటేశ్వరరావు, మెంటం రామారావు, నగర యువజన విభాగం త్రీ టౌన్ అధ్యక్షులు మాటేటి కిరణ్, నగర ప్రచార కార్యదర్శి సకీనా, మహిళా విభాగం నాయకురాలు కొల్లు పద్మ, బీసీ సెల్ నాయకులు వీరేంద్ర గౌడ్, యువజన విభాగం నాయకులు కొమ్ము విజేత తదితరులు పాల్గొన్నారు.

# నూతన ప్రజాప్రతినిధులకు అభినందనలు



**- సమస్యల పరిష్కారంలో మున్సిపల్ పాలకవర్గం ముందుండాలి**

**- ప్రభుత్వ సంక్షేమ పథకాలు గడపగడపకు చేరవేయండి**

**- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, మాజీ శాసనసభ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు**

**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 17 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్ర రాజకీయాల్లో ఖమ్మం జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందని, ఖమ్మం అంటేనే కాంగ్రెస్ అడ్డా అనే నానుడిని మరోసారి నిరూపించి మున్సిపల్ ఎన్నికల్లో భారీ విజయం అందించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలని అలాగే నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లు వార్డు కౌన్సిలర్లకు ప్రత్యేక అభినందనలు అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్,మాజీ శాసనసభ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు లు అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రతి సమస్యను తెలుసు కోవాలి, సమస్యల పరిష్కారంలో ముందుండాలన్నారు. రాజకీయాల కతీతంగా ప్రతీ ఒక్కరి సమస్య విని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ విజయం నిఖార్సైన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అంకితం అని అన్నారు. ఈ విజయం ఏ ఒక్కరిదీ కాదు, ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్తది అని పేర్కొ న్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు ప్రజల నమ్మకాన్ని వొమ్ము చేయకుండా పని చేయాలని సూచించారు. ఇది ఏ ఒక్కరి విజయం కాదు. ఇది అందరి సమష్టి విజయం అని అన్నారు. నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ...కౌన్సిలర్ లు గా సేవ చేయడం గొప్ప అవకాశంగా భావించాలని, మీ వార్డులో చేసే అభివృద్ధి కలకాలం గుర్తుండి పోవాలన్నారు. మనం గెలిచింది ఈ ప్రాంతాన్ని బాగు చేయడం కోసం, కాలనీలను అభివృద్ధి చేసి ప్రజల ఆశీర్వాదం పొందడంకోసం అన్నది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గడపగడపకు చేరవేయాల్సిన భాధ్యత మున్సిపల్ కౌన్సలర్ గా ఎన్నికైన ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అదేవిధంగా మున్ముందు జరగబోయే ఎంపీటిసి, జెడ్పిటిసి ఎన్నికలు త్వరలో వస్తాయని అందుకు జిల్లా కాంగ్రెస్ నాయకులు, బ్లాక్, మండల అధ్యక్షులు గ్రామ శాఖ అద్యక్షులు, గ్రామ ముఖ్య నాయకులు సన్నద్ధం కావాలని తద్వారా కాంగ్రెస్ పార్టీని పటిష్ట పరుస్తూ అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలని పత్రికా ముఖంగా కోరారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు బొడ్డు బొందయ్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, మొక్క శేఖర్ గౌడ్, నగర ఐ.యన్.టి.యు.సి అధ్యక్షులు నరాల నరేష్ నాయుడు, నగర కాంగ్రెస్ నాయకులు కోసూరి ప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.